తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
వరంగల్ | బుధవారం-21- జనవరి 2026 | సంపుటి : 3 | సంచిక : 233 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

## దావోస్‌లో తెలంగాణ రైజింగ్

# 2047 విజన్‌కు గ్లోబల్ వేదిక




- వరల్డ్ ఎకనామిక్ ఫోరం–2026లో పెట్టుబడిదారులతో వ్యూహాత్మక భేటీలు
- తెలంగాణకు అనుకూల పెట్టుబడి వాతావరణం ప్రదర్శన
- సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం

**దావోస్, జనవరి 20 (తెలంగాణ ముచ్చట్లు):**

వరల్డ్ ఎకనామిక్ ఫోరం-2026 వార్షిక సదస్సులో తెలంగాణ పెట్టుబడిదారులకు అనుకూలమైన రాష్ట్రంగా తన బలాలను గ్లోబల్ సీఈఓలు, పరిశ్రమ నేతల ముందుంచుతూ ముందుకు సాగుతోంది. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ముందుకు తీసుకెళ్లే దిశగా గ్లోబల్ కార్పొరేట్ నాయకులతో విస్తృత చర్చలు జరుగుతున్నాయి.

ఈ కార్యక్రమాలకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వం వహించగా, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు, ఉన్నతాధికారులు, తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం పాల్గొంటోంది. పెట్టుబడులకు అనుకూల విధానాలు, వేగవంతమైన అనుమతులు, మౌలిక సదుపాయాలు, నైపుణ్య వనరులు వంటి అంశాలను ప్రపంచ పరిశ్రమ నేతలకు వివరించారు.

రాష్ట్రంలో తయారీ, ఐటీ, డిజిటల్ టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ, ఫార్మా, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో ఉన్న అవకాశాలను సమావేశాల్లో ప్రస్తావించారు. దీర్ఘకాలిక పెట్టుబడులు, ఉపాధి సృష్టి, టెక్నాలజీ బదిలీపై తెలంగాణ ప్రభుత్వం స్పష్టమైన దృష్టితో ముందుకు సాగుతోందని ప్రతినిధి బృందం వివరించింది.

తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్య సాధనలో భాగంగా గ్లోబల్ భాగస్వామ్యాలు కీలకమని పేర్కొంటూ, దావోస్ వేదికపై జరుగుతున్న ఈ వ్యూహాత్మక చర్చలు రాష్ట్ర ఆర్థిక వృద్ధికి దోహదపడతాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.




## సినిమా టికెట్ ధరల పెంపుపై తెలంగాణ హైకోర్టు సంచలన ఆదేశాలు

- టికెట్ ధరల పెంపు ఉత్తర్వులు 90 రోజుల ముందే ఇవ్వాలి
- కోర్టు సెలవుల్లో జీఓ జారీపై అభ్యంతరం
- పిటిషన్‌పై కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్, జనవరి 20 (తెలంగాణ ముచ్చట్లు):** సినిమా టికెట్ ధరల పెంపుకు సంబంధించి తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇకపై సినిమా టికెట్ ధరల పెంపుకు సంబంధించిన ఉత్తర్వులు కనీసం 90 రోజుల ముందే ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు జారీ చేసే జీఓలు ముందస్తు ప్రణాళికతో, పారదర్శకంగా

7 లో

## ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం పై హరీష్ రావు తీవ్ర వ్యాఖ్యలు

- న్యాయం మా వైపే ఉందని స్పష్టం
- ప్రభుత్వంపై స్కాంల ఆరోపణలు

**హైదరాబాద్, జనవరి 20 (తెలంగాణ ముచ్చట్లు):**



గతంలో తనపై ఫోన్ ట్యాపింగ్ కేసు పెట్టినప్పుడు సుప్రీం కోర్టు చెంపచెల్లుమనే తీర్పు ఇచ్చిందని, న్యాయం తమ వైపే ఉందని స్పష్టంగా నిరూపితమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీష్ రావు వ్యాఖ్యానించారు. ఇదే వ్యవహారంలో హైకోర్టులో కూడా తమకే అనుకూలంగా తీర్పు వచ్చిందని గుర్తు చేశారు.

రెండేళ్లు గడిచినా అదే సీరియల్‌ను ఎన్ని రోజులు నడుపుతారని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని ఉద్దేశించి హరీష్ రావు ప్రశ్నించారు.

మిగతా 2లో

## రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్, వామపక్షాల ఐక్య పోరాటాలు అవసరం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ఖమ్మంలో సీపీఐ శత వసంతాల జాతీయ సెమినార్‌లో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి
- ఫాసిస్టు–కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా సమిష్టి ఉద్యమం పిలుపు
- ప్రజాస్వామ్య హక్కుల కోసం సుదీర్ఘ ప్రయాణం చేయాల్సిన బాధ్యత



**ఖమ్మం, జనవరి 20 (తెలంగాణ ముచ్చట్లు):**

మతం పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి సవాల్ విసురుతున్న ఫాసిస్టు, కార్పొరేట్ శక్తులను అడ్డుకోవాలంటే ఐక్య పోరాటాలు తప్పనిసరని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మంలో సీపీఐ శత వసంతాల సందర్భంగా నిర్వహించిన జాతీయ సెమినార్‌లో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల రక్షణ కోసం

మిగతా 2లో



## పర్యావరణ పరిరక్షణలో హైడ్రా చర్యలు ప్రశంసనీయం

- స్కోకిన్ ఆసియా డైలాగ్స్ ఫోరం ఆసక్తి
- పర్యావరణ హితమైన నగరమే లక్ష్యం
- ప్రజా ఆస్తుల పరిరక్షణకు పెద్దపీట

**హైదరాబాద్, జనవరి 20 (తెలంగాణ ముచ్చట్లు):** సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి ఎంత ముఖ్యమో, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే అవసరమని స్కోకిన్ ఆసియా డైలాగ్స్ ఫోరం–2026 స్పష్టం చేసింది. మెరుగైన, ఆరోగ్యకరమైన జీవనానికి పర్యావరణానికి పెద్దపీట వేయాల్సిన అవసరం ఉందని పేర్కొంది.

7 లో

## ఆర్టీసీ సేవలు మరింత సమర్థవంతం చేయాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్
- సెక్రటేరియట్‌లో ఆర్టీసీపై సమీక్షా సమావేశం
- మేడారం జాతరకు ప్రత్యేక బస్సు ఏర్పాట్లు
- పెండింగ్ పనుల పరిష్కారంపై దృష్టి




**హైదరాబాద్, జనవరి 20 (తెలంగాణ ముచ్చట్లు):**

సెక్రటేరియట్‌లో రాష్ట్ర రవాణా శాఖ ఆధ్వర్యంలో ఆర్టీసీపై సమీక్షా సమావేశం నిర్వహించినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ సమావేశంలో స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, ఆర్టీసీ ఎండీ నాగి రెడ్డి, ఆర్టీసీ ఈడీలు, ఆర్ఎంలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన రవాణా సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి విభాగం సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

మిగతా 2లో

## కాంగ్రెస్ అవినీతి, అటెన్షన్ డైవర్షన్ రాజకీయాలు బహిర్గతం చేస్తాం: కేటీఆర్

- నోటీసులకు భయపడేది లేదు, ప్రశ్నిస్తూనే ఉంటాం
- సింగరేణి టెండర్లలో కుట్రలు, బెదిరింపులు
- సిట్ విచారణల పేరుతో ప్రజల దృష్టి మళ్లింపు

**హైదరాబాద్, జనవరి 20 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

మిగతా 7లో





## నాగర్‌కర్నూల్‌లో కరెంట్ షాక్‌తో విద్యార్థి మృతి

- పాఠశాల ప్రహరీ గోడ వద్ద విషాద ఘటన
- చికిత్సకు తరలించేలోపే మృతి నిర్ధారణ
- విద్యుత్ శాఖ నిర్లక్ష్యంపై స్థానికుల ఆరోపణలు

**నాగర్‌కర్నూల్, జనవరి 20 (తెలంగాణ ముచ్చట్లు):** నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని ఇంద్రకల్ గ్రామంలో కరెంట్ షాక్‌తో విద్యార్థి మృతి చెందిన విషాద ఘటన మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మల్లేష్, లక్ష్మమ్మ దంపతుల పెద్ద కుమారుడు లోకేష్ (14) స్థానిక ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు.

7 లో



## కామారెడ్డిలో ఇందిరా గాంధీ విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం

- టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ, మాజీ మంత్రులు హాజరు
- పేదల హృదయాల్లో చిరస్థాయిగా ఇందిరా గాంధీ

**కామారెడ్డి, జనవరి 20 (తెలంగాణ ముచ్చట్లు):**

కామారెడ్డి పట్టణంలో మాజీ ప్రధాని, స్వర్గీయ ఇందిరా గాంధీ విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మాజీ మంత్రి మొహమ్మద్

మిగతా 2లో

## మహిళల ఆర్థిక అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- యాదగిరిగుట్టలో స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాల పంపిణీ
- పేద, మధ్యతరగతి మహిళలకు భద్రత–ఆత్మవిశ్వాసం
- కుటుంబాలకు మాత్రమే కాదు సమాజానికి ఆదర్శంగా మహిళలు

**యాదాద్రి భువనగిరి జిల్లా, జనవరి 20 (తెలంగాణ ముచ్చట్లు):**

మహిళల ఆర్థిక అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. యాదగిరిగుట్టలో నిర్వహించిన కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలను పంపిణీ చేశారు. మహిళలు స్వావలంబన సాధించేలా ప్రభుత్వం నిరంతరం మద్దతు అందిస్తుందని మంత్రి తెలిపారు. పేద, మధ్యతరగతి మహిళల జీవితాల్లో భద్రత,

మిగతా 2లో



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# దావోస్‌కు చేరిన తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం

- ప్రవాస తెలంగాణవాసుల ఘన స్వాగతం
- ప్రపంచ వేదికపై తెలంగాణ రైజింగ్ రెండు వేల నలభై ఏడు



**జ్యూరిచ్, జనవరి 20 (తెలంగాణ ముచ్చట్లు):**

ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సు రెండు వేల ఇరవై ఆరులో పాల్గొనేందుకు వెళ్లిన తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం స్విట్జర్లాండ్ దేశంలోని జ్యూరిచ్ నగరానికి చేరుకుంది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సారథ్యంలో వెళ్లిన ప్రతినిధి బృందానికి జ్యూరిచ్ విమానాశ్రయంలో ప్రవాస తెలంగాణవాసులు ఘన స్వాగతం పలికారు. తెలంగాణ భవిష్యత్ అభివృద్ధి లక్ష్యాలను ప్రపంచానికి చాటిచెప్పే ఈ పర్యటనకు విశేష ప్రాధాన్యం ఏర్పడింది.

స్విట్జర్లాండ్‌లోని భారత రాయబారి మృదుల్ కుమార్‌తో పాటు ఇతర అధికారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం మర్యాదపూర్వకంగా భేటీ అయి, దావోస్ సదస్సు ప్రాధాన్యం, అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు ఉన్న పెట్టుబడి అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశం రాష్ట్రానికి అనుకూల పెట్టుబడి వాతావరణాన్ని మరింత బలపరిచే దిశగా సాగింది. దావోస్ పర్యటనలో ముఖ్యమంత్రి వెంట మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మరోవైపు సమాచార సాంకేతిక, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఇప్పటికే దావోస్‌కు చేరుకున్నారు. నాలుగు రోజుల పాటు జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో తెలంగాణ ప్రతినిధి బృందం చురుగ్గా పాల్గొననుంది.

సదస్సు తొలి రోజున వివిధ రంగాలకు చెందిన అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమవుతారు. ఈ సందర్భంగా 'తెలంగాణ రైజింగ్ రెండు వేల నలభై ఏడు' అభివృద్ధి రోడ్‌మ్యాప్‌ను దావోస్ వేదికపై ప్రపంచానికి పరిచయం చేయనున్నారు. రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధి లక్ష్యాలు, ప్రభుత్వ విధానాలు, పెట్టుబడులకు ఉన్న అనుకూల వాతావరణాన్ని వివరించడమే ప్రధాన లక్ష్యంగా ఈ పర్యటన కొనసాగుతోంది. డిసెంబర్‌లో ఆవిష్కరించిన తెలంగాణ రైజింగ్ రెండు వేల నలభై ఏడు విజన్ పత్రానికి అనుగుణంగా సుస్థిర పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం ఈ సదస్సులో తన అజెండాను ముందుకు తీసుకెళ్తోంది.

# ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై హరీష్ రావు తీవ్ర వ్యాఖ్యలు

(మొదటి పేజీ తరువాయి)



ప్రజల దృష్టిని మళ్లించేందుకు పదే పదే అదే అంశాన్ని తెరపైకి తీసుకొస్తున్నారని ఆరోపించారు. రాజకీయంగా దారి మళ్లింపులు చేయడం ద్వారా నిజాలను దాచలేరని స్పష్టం చేశారు.

ప్రభుత్వం ఎన్ని డైవర్షన్లు చేసినా బొగ్గు స్కాం, విద్యుత్ స్కాం, హిల్ టీపీ స్కాంలను బయటపెడతామని హరీష్ రావు హెచ్చరించారు. రాష్ట్ర ప్రజలకు జరిగిన అన్యాయాలపై తాము మౌనం పాటించబోమని, ప్రతి అంశాన్ని ప్రజల ముందుకు తీసుకువస్తామని తెలిపారు.

అలాగే ఆంధ్రాకు అమ్ముడు పోయిన అంశంపై నిరంతరం నిలదీస్తూనే ఉంటామని హరీష్ రావు స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం తమ హక్కు అని, ప్రభుత్వ వైఫల్యాలను బయటపెట్టడమే తమ లక్ష్యమని ఆయన అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని ఈ సందర్భంగా ఆయన తేల్చిచెప్పారు.

# రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్.. మేము భయపడేది లేదు: హరీష్ రావు

- నోటీసులు, కేసులతో ప్రశ్నల నుంచి తప్పించుకునే ప్రయత్నం
- బొగ్గు, పవర్, హిల్ టీపీ స్కాంలపై మౌనం ఎందుకు
- మున్సిపల్ ఎన్నికల ముందు రాజకీయ డ్రామా

**హైదరాబాద్, జనవరి 20 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన బంధువుల వ్యవహారాలపై ప్రశ్నలు లేవనెత్తితే నోటీసులు ఇచ్చి బెదిరించే ప్రయత్నం చేస్తున్నారని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర విమర్శలు చేశారు. ఉదయం అవినీతి బాగోతాలు బయటపెడితే, సాయంత్రానికి నోటీసులు ఇవ్వడం ద్వారా ప్రజల దృష్టిని మళ్లించాలనే కుట్ర స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఎన్నో కేసులు, నిర్బంధాలు ఎదుర్కొన్న తమకు ఇలాంటి బెదిరింపులు కొత్తకాదని స్పష్టం చేశారు.

బొగ్గు స్కాం, పవర్ స్కాం అంశాలు బయటపెట్టిన తర్వాత ఒక్క కాంగ్రెస్ మంత్రి గానీ, నేత గానీ మాట్లాడకపోవడం అనుమానాలకు తావిస్తోందని హరీష్ రావు అన్నారు. దండుపాళ్యం ముఠా వాటాల పంపకాల విషయాన్ని ప్రజల ముందు ఉంచితే, దానిపై సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం మౌనం పాటిస్తోందని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ అవినీతి బండారం బయటపడితే నష్టం జరుగుతుందనే భయంతోనే డైవర్షన్ పాలిటిక్స్ మొదలుపెట్టారని ఆరోపించారు.

ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయి, మహిళలకు మహాలక్ష్మి పథకం ఎక్కడ, వృద్ధులకు నాలుగు వేల పెన్షన్ ఎప్పుడు ఇస్తారో చెప్పాలని ప్రశ్నించామని హరీష్ రావు గుర్తు చేశారు. హిల్ టీపీ, పవర్ స్కాం, భూకుంభకోణాలపై నిలదీస్తే కేసులు, విచారణల పేరుతో దాడి చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. కృష్ణా, గోదావరి నీళ్లను ఆంధ్రప్రదేశ్‌కు అప్పగిస్తూ తెలంగాణకు ద్రోహం జరుగుతుంటే ప్రశ్నించడం తమ బాధ్యత అని స్పష్టం చేశారు.

పంచాయతీ ఎన్నికల ముందు కేటీఆర్‌పై, మున్సిపల్ ఎన్నికల ముందు తనపై నోటీసులు ఇవ్వడం ఎన్నికల రాజకీయమేనని హరీష్ రావు వ్యాఖ్యానించారు. సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు వచ్చిన విజయాన్ని చూసి ప్రభుత్వ అంచనాలు తప్పాయని అన్నారు. గతంలో తనపై పెట్టిన ఫోన్ ట్యాపింగ్ కేసును సుప్రీం కోర్టు కొట్టివేసిందని, హైకోర్టులోనూ న్యాయం తమవైపే ఉందని గుర్తు చేశారు. కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కయిందన్న అనుమానాలు నివృత్తి కావాలంటే సీబీఐ విచారణ వేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి నిధులను రాజకీయ ప్రదర్శనలకు ఖర్చు చేయడంపై కూడా స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, తెలంగాణ ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తామని హరీష్ రావు స్పష్టం చేశారు.

# రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్, వామపక్షాల ఐక్య పోరాటాలు అవసరం

(మొదటి పేజీ తరువాయి)




కాంగ్రెస్ పార్టీతో పాటు వామపక్ష పార్టీలు కలిసి ముందుకు సాగాల్సిన చారిత్రక బాధ్యత ఉందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రజల హక్కులను కాపాడే పోరాటంలో సిద్ధాంత భేదాలను పక్కనపెట్టి సమిష్టిగా నిలవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే ప్రయత్నాలు దేశవ్యాప్తంగా జరుగుతున్న తరుణంలో, వాటిని ఎదుర్కొనే శక్తి ప్రజల ఐక్యతలోనే ఉందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. కార్మికులు, రైతులు, పేదలు, మధ్యతరగతి వర్గాల ప్రయోజనాలను కాపాడడమే లక్ష్యంగా ఉద్యమాలు కొనసాగాలని పిలుపునిచ్చారు. సీపీఐ శత వసంతాల ప్రస్థానం దేశ రాజకీయ చరిత్రలో కీలకమైనదని భట్టి విక్రమార్క గుర్తు చేశారు. ప్రజా ఉద్యమాల ద్వారా సాధించిన హక్కులను మరింత బలోపేతం చేస్తూ, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునే దిశగా కాంగ్రెస్, వామపక్షాల సంయుక్త ప్రయాణం కొనసాగాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు.

# ఆర్టీసీ సేవలు మరింత సమర్థవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)




నిర్వహణ, సిబ్బంది సమస్యలు, సేవల నాణ్యత వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.

మేడారం జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక బస్సు ఆపరేషన్లు చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు బస్సులు, ప్రత్యేక రూట్లు, టైమ్‌టేబుల్ పర్యవేక్షణ వంటి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. భద్రత, శుభ్రత, సమయపాలనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు.

ప్రజా రవాణా వ్యవస్థపై ప్రజల నమ్మకం పెరిగేలా నిర్ణయాలు అమలు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రయాణికుల సౌకర్యమే ప్రథమ లక్ష్యంగా ఆర్టీసీ ముందుకు సాగాలని, అవసరమైన చోట తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# కామారెడ్డిలో ఇందిరా గాంధీ విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం

(మొదటి పేజీ తరువాయి)



అలీ షబ్బీర్, జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్ పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ (సీతక్క) కూడా పాల్గొని ఇందిరా గాంధీ విగ్రహానికి నివాళులు అర్పించారు. పేదల అభ్యున్నతే లక్ష్యంగా ఇందిరా గాంధీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నేటికీ దేశానికి దిశానిర్దేశం చేస్తున్నాయని ఈ సందర్భంగా వక్తలు పేర్కొన్నారు.

దశాబ్దాల క్రితం అమలు చేసిన భూమి సంస్కరణలు, బ్యాంకుల జాతీయాకరణ వంటి నిర్ణయాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపాయని తెలిపారు. ఇందిరా గాంధీ ఆశయాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు ఇప్పటికీ ప్రేరణగా నిలుస్తున్నాయని అన్నారు. పేదల గుండెల్లో ఇందిరా గాంధీ పేరు చిరస్థాయిగా నిలిచిపోయిందని, ఆమె సామాజిక న్యాయం, సంక్షేమ పాలనకు ప్రతీకగా నిలిచిందని నాయకులు స్పష్టం చేశారు.




# పర్యావరణ పరిరక్షణలో హైడ్రా చర్యలు ప్రశంసనీయం

**హైదరాబాద్, జనవరి 20 (తెలంగాణ ముచ్చట్లు):**

సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి ఎంత ముఖ్యమో, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే అవసరమని స్పీకిన్ ఆసియా డైలాగ్స్ ఫోరం-2026 స్పష్టం చేసింది. మెరుగైన, ఆరోగ్యకరమైన జీవనానికి పర్యావరణానికి పెద్దపీట వేయాల్సిన అవసరం ఉందని పేర్కొంది.

ఈ దిశగా హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) చేపడుతున్న చర్యలను ఫోరం ప్రతినిధులు అభినందించారు.

"ది గ్రేట్ ఇంటిగ్రేషన్: టెక్నాలజీ, టాలెంట్ అండ్ ట్రాన్స్‌ఫార్మేషన్ ఇన్ ఆసియా" అనే అంశంపై తాజ్ ఫలక్‌నుమాలో నిర్వహించిన స్పీకిన్ ఆసియా డైలాగ్స్ ఫోరం-2026 సమావేశంలో ఐటీ, విద్యా సంస్థలు సహా పలు రంగాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైడ్రా కార్యకలాపాల పట్ల పలువురు ఆసక్తి కనబర్చారు. హైడ్రా కృషి పర్యావరణ పరిరక్షణకు దిశానిర్దేశకంగా మారుతోందని కొనియాడారు.

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. పర్యావరణ హితమైన నగర నిర్మాణమే హైడ్రా అభిమతమని తెలిపారు. చెరువులు, వాటిని అనుసంధానించే వరద కాలువల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. హైడ్రా అనేది కేవలం ఆక్రమణల తొలగింపు సంస్థ మాత్రమే కాదని, ప్రజా ఆస్తుల పరిరక్షణ, పర్యావరణ సంరక్షణ, విపత్తు నిర్వహణ, పట్టణ భద్రత వంటి విస్తృత లక్ష్యాలతో పనిచేస్తోందని వివరించారు.

ఇప్పటివరకు సుమారు 1,350 ఎకరాల ప్రభుత్వ భూములను కాపాడామని, వాటి విలువ దాదాపు రూ.65 వేల కోట్ల వరకు ఉంటుందని ఏవీ రంగనాథ్ వెల్లడించారు. ముందస్తు చర్యలతో ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునేలా నగరాన్ని తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. చెరువుల పునరుజ్జీవనం, పార్కుల అభివృద్ధి, పచ్చదనం పెంపొందించేందుకు హైడ్రా తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయం అని పలువురు వక్తలు పేర్కొన్నారు. చట్టాలు ఉన్నప్పటికీ అమలులో అలసత్వంతో నగర జీవనం దుర్భరంగా మారుతున్న తరుణంలో, హైడ్రా ఒక దిక్సూచిగా నిలుస్తోందని ఫోరం ప్రతినిధులు అభిప్రాయపడ్డారు.

# మహిళల ఆర్థిక అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

(మొదటి పేజీ తరువాయి)

ఆత్మవిశ్వాసం నింపడమే ప్రభుత్వ ధ్యేయమని ఆయన పేర్కొన్నారు. ఆర్థికంగా బలోపేతమైన మహిళే కుటుంబానికి అండగా నిలుస్తుందని, పిల్లల విద్య, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు చిన్న పరిశ్రమలు, వ్యాపారాలు ప్రారంభించి ఆదాయం పెంచుకునే అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని మంత్రి వివరించారు. వడ్డీ భారం లేకుండా రుణాలు అందించడం ద్వారా మహిళలపై ఆర్థిక ఒత్తిడి తగ్గి, వారి పురోగతి వేగవంతమవుతుందని చెప్పారు.

మహిళలు ఆర్థికంగా ఎదిగి తమ కుటుంబాలకే కాకుండా పదిమందికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షిస్తున్నట్లు కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. మహిళా సాధికారతతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని పేర్కొంటూ, ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తరించనున్నట్లు ఆయన వెల్లడించారు.



# ఎల్కతుర్తి మండలంలోని గ్రామాల్లో నిద్రిస్తున్న నిఘా నేత్రాలు

- పనిచేయని సీసీ కెమెరాలతో భద్రత ప్రశ్నార్థకం





**ఎల్కతుర్తి, జనవరి 20 (తెలంగాణ ముచ్చ-ట్లు):** ఎల్కతుర్తి మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు సరిగా పనిచేయకపోవడంతో గ్రామాల్లో భద్రత తీవ్రంగా దెబ్బతింటోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిఘా నేత్రాలుగా భావించే సీసీ కెమెరాలు నిర్వీర్యంగా మారడంతో దొంగతనాలకు అడ్డుకట్ట పడడం లేదని వారు వాపోతున్నారు.

ఇటీవల మండలంలోని కొన్ని గ్రామాల్లో ఆవులు, గేదెల దొంగతనాలు చోటుచేసుకున్నాయని గ్రామస్తులు తెలిపారు. అయితే కీలక ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయకపోవడం వల్ల నిందితులను గుర్తించడం కష్టసాధ్యంగా మారిందని పేర్కొన్నారు. ముఖ్యంగా బావిలకాడకు వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేసి ఉంటే దొంగల ఆచూకీ సులభంగా లభించేదని వారు అభిప్రాయపడ్డారు.

సీసీ కెమెరాల నిర్వహణలో సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగా గ్రామాల్లో భద్రతా లోపాలు తలెత్తుతున్నాయని, ఇది దొంగలకు వరంగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో సర్పంచులు లేకపోవడం వల్ల ఈ సమస్యపై సరైన స్పందన రాలేదని వారు తెలిపారు.

ఇకనైనా నూతనంగా ఎన్నికైన సర్పంచులు గ్రామాభివృద్ధితో పాటు శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారించి, పనిచేయని సీసీ కెమెరాలను వెంటనే మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు. నిఘా వ్యవస్థ పటిష్టంగా లేకపోతే గ్రామాల్లో భద్రత మరింత ప్రమాదంలో పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

# జంక్షన్ల వద్ద ప్రమాదాల నియంత్రణకు పూర్తి స్థాయి చర్యలు...

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- సురక్షిత డ్రైవింగ్ తో రహదారి ప్రమాదాలను నివారించవచ్చు
- ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలి
- కలెక్టరేట్ లో రోడ్డు భద్రత కమిటీ చర్యల పురోగతిపై సమీక్షించిన జిల్లా కలెక్టర్





**ఖమ్మం బ్యూరో, జనవరి 20(తెలంగాణ ముచ్చట్లు):** జిల్లాలో ప్రమాదాలు అధికంగా జరిగే 30 జంక్షన్ ల వద్ద ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని కలెక్టర్ చాంబర్ నందు జంక్షన్ లు, ప్రధాన రహదారులపై జరిగే ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రత కమిటీ చేపట్టిన చర్యల పురోగతిపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో 30 జంక్షన్ లలో 50 శాతం పైగా ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించామని, జంక్షన్ల వద్ద రోడ్డు భద్రతా ప్రమాణాలు చేపడితే ప్రమాదాలు నియంత్రించవచ్చని అన్నారు. 30 జంక్షన్ల వద్ద వాహనాల వేగం తగ్గించేందుకు రంబుల్ స్ట్రీప్స్, లేన్ మార్కింగ్, రాత్రి వేళల్లో సరిగ్గా కనిపించేందుకు ఏర్పాట్లు, ఆక్రమణల తొలగింపు, జీబ్రా క్రాసింగ్, సైన్ బోర్డ్స్, బ్లింకర్స్ ఏర్పాటు వంటి చర్యలు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రోడ్డు భద్రత మాసోత్సవాల కార్యక్రమంలో 30 జంక్షన్ల వద్ద రోడ్డు భద్రతా చర్యలు చేపట్టడం ప్రాధాన్యతగా తీసుకోవాలని అన్నారు. రోడ్డు ప్రమాదాలలో ఒక వ్యక్తి చనిపోతే ఒక కుటుంబం తీవ్రంగా ప్రభావితం అవుతుందని, దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్క అధికారి ప్రత్యేక శ్రద్ధ పెట్టి జంక్షన్ ల వద్ద అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ ఏ. పద్మశ్రీ, నేషనల్ హైవే ఇఇ యుగంధర్, పిడి దివ్య, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కాప్రా నాచారం సర్కిల్స్‌లో శానిటేషన్, ఎంటమాలజీపై సమీక్ష

- ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి: అడిషనల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి






**కాప్రా, జనవరి 20 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజ్‌గిరి-ఉప్పల్, ఎల్బీనగర్ జిహెచ్ఎంసి అడిషనల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి కాప్రా, నాచారం సర్కిల్స్‌కు సంబంధించిన శానిటేషన్ మరియు ఎంటమాలజీ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా శానిటేషన్ విభాగానికి సంబంధించి ఇంటింటి చెత్త సేకరణ, వ్యాపార స్థలాల నుంచి చెత్త సేకరణ, స్వచ్ఛ ఆటోల పనితీరు మరియు పర్యవేక్షణ, గ్రీన్ వేస్ట్ లిఫ్టింగ్ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. చెత్త నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని అధికారులకు సూచించారు.అదేవిధంగా ఎంటమాలజీ విభాగం పనితీరును మరింత మెరుగుపరచాలని, సిబ్బంది నైపుణ్యాన్ని పెంచి ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించాలని సూచించారు. దోమల నివారణకు ఫాగింగ్ కార్యక్రమాన్ని సరైన షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని, ఆ వివరాలను ప్రజలకు ముందుగానే తెలియజేయాలని తెలిపారు. ఆయా విభాగాలకు సంబంధించిన విధులను చిత్తశుద్ధితో, బాధ్యతాయుతంగా నిర్వహించాలని అడిషనల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులకు ఆదేశించారు.ఈ సమావేశంలో కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీహరి, నాచారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ నిత్యానంద్, డీఈ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ బాలకృష్ణ, రవి, ఏఈ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ వెన్నెల, సానిటరీ సూపర్వైజర్ సుదర్శన్, ఏఈ ఎంటమాలజీ రమేష్, శానిటేషన్ విభాగ జవాన్లు, ఎస్ఎఫ్ఏలు, ఎంటమాలజీ విభాగ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# హెచ్ఎంటి నగర్ చెరువులో గుర్రపు డెక్క తొలగింపు పనులు త్వరలో ప్రారంభం

- ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా హామీ



**నాచారం, జనవరి 20 (తెలంగాణ ముచ్చ-ట్లు):** ఉప్పల్ నియోజకవర్గం నాచారం పరిధిలోని హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువులో విపరీతంగా పెరిగిన గుర్రపు డెక్కను త్వరలోనే పూర్తిగా తొలగిస్తామని ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా హామీ ఇచ్చారు. హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువులో గుర్రపు డెక్క విస్తృతంగా పెరిగి చెరువు పరిసర ప్రాంతాల్లో దుర్వాసనతో పాటు దోమల బెడద పెరుగుతున్న విషయాన్ని ఇదివరకే జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో తాజాగా ఆమెను కలిసి గుర్రపు డెక్క తొలగింపుకు సంబంధించిన మరిన్ని వివరాలను విన్నవించారు.ఈ సందర్భంగా కాప్రా సర్కిల్‌కు చెందిన ఇంజినీరింగ్ అధికారులు గుర్రపు డెక్క తొలగింపు పనులు పూర్తికాకుండానే బిల్లులు చెల్లించినట్లు ఆరోపణలు రావడంతో, దీనిపై తక్షణమే విచారణ చేపట్టాలని కోరారు. అలాగే మిగిలి ఉన్న గుర్రపు డెక్కను ఎలాంటి ఆలస్యం లేకుండా పూర్తిగా తొలగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.గత సంవత్సరం మెయింటెనెన్స్ కాంట్రాక్టు ముగిసినందున, కొత్త కాంట్రాక్టర్‌ను నియమించి చెరువు సంరక్షణ పనులను పకడ్బందీగా చేపట్టాలని కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ జోనల్ కమిషనర్‌ను కోరారు.ఈ విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ రాధిక గుప్తా, త్వరలోనే గుర్రపు డెక్క తొలగింపు పనులు ప్రారంభిస్తామని, అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## అరైవ్ అలైవ్ క్యాంపెయిన్-2026 లో భాగంగా అవగాహన కార్యక్రమం



**కాప్రా, జనవరి 20 (తెలంగాణ ముచ్చ-ట్లు):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న "అరైవ్ అలైవ్ క్యాంపెయిన్-2026" కార్యక్రమంలో భాగంగా కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని కైలాసగిరి కామన్, హెచ్‌బీ కాలనీ వద్ద రోడ్డు భద్రతపై అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని బి. శ్రీనివాస్, ఎస్ఐపీ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది నిర్వహించారు. సమావేశంలో రహదారులపై ప్రయాణించేటప్పుడు మరియు వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన ముఖ్యమైన జాగ్రత్తలపై ప్రజలకు విలువైన మార్గదర్శకత్వం మరియు ప్రాయోగిక సూచనలు అందించారు.ప్రధానంగా ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించడం, వాహనం నడుపుతున్న సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం వంటి వాటితో దృష్టి మరలకుండా ఉండటం, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం, నాలుగు చక్రాల వాహనదారులు సీట్‌బెల్ట్ వినియోగించడం వంటి అంశాలపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు.బాధ్యతాయుతంగా వాహనాలు నడపడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని, ప్రతి ఒక్కరి జాగ్రత్తే అనేక ప్రాణాలను కాపాడగలదని పోలీసులు ఈ సందర్భంగా వివరించారు.ప్రజల భద్రతే లక్ష్యంగా ఇలాంటి అవగాహన కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు.

## బండాచెరువు వాకర్స్ పార్క్ అభివృద్ధి పనులకు శ్రీకారం



**వినాయక్‌నగర్, జనవరి 20 (తెలంగాణ ముచ్చట్లు):** బండాచెరువు వాకర్స్ పార్కులో రూ.16 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు వినాయక్‌నగర్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి శుభారంభం చేశారు.ఈ అభివృద్ధి పనుల్లో పార్కులో ర్యాంప్ నిర్మాణం, మెట్లు, చెరువులోకి దిగేందుకు ప్రత్యేక మెట్లు, పార్కింగ్ స్థలం ఏర్పాటు, ఆర్చ్ నిర్మాణంతో పాటు ఇతర సౌకర్యాల అభివృద్ధి ఉన్నాయి. ఈ పనులు పూర్తయ్యే సరికి వాకర్లకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం ఏర్పడనుందని కార్పొరేటర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో లాల్వాని నగర్ కాలనీ అధ్యక్షుడు నరేష్, అసోసియేషన్ సభ్యులు ప్రేమ్ కుమార్, గోపాల్ యాదవ్, బీజేపీ సీనియర్ నాయకులు ఆనంద్ గౌళికర్, ఓం ప్రకాష్, సంతోష్, బీజేపీ నాయకులు జగదీష్‌చారి, సాయి సురేష్, గోపాల్, ఉమా కాంత్ పాల్గొన్నారు.అలాగే ఇంజినీరింగ్ విభాగం ఏఈ నవీన్ కుమార్, సూపర్‌వైజర్లు సాగర్, వెంకటేష్, హార్టికల్చర్ సూపర్‌వైజర్ వెంకటేష్ హాజరై పనుల వివరాలను పరిశీలించారు.స్థానిక ప్రజలు ఈ అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేసి పార్కును మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని కోరారు.

## భక్తిశ్రద్ధలతో వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం



**నాచారం, జనవరి 20 (తెలంగాణ ముచ్చట్లు):** వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని నాచారం ప్రాంతంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శ్రీ వాసవి ఆర్యవైశ్య సంఘం నాచారం కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. నాచారం ఆర్యవైశ్య సంఘం కార్యాలయంలో వాసవి మాత విగ్రహానికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి మాత చరిత్రను పఠించి ఆమె త్యాగాన్ని స్మరించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి ఆర్యవైశ్య సంఘం నాచారం అధ్యక్షుడు శ్రీరామ్ సత్యనారాయణ (బండల), గౌరవ అధ్యక్షుడు సింగిరికొండ నరసింహ, ప్రధాన కార్యదర్శి బొగ్గారపు రమేష్‌గుప్తా, కోశాధికారి భాస్కర్‌తో పాటు కార్యవర్గ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.వాసవి మాత ఆదర్శాలు నేటి సమాజానికి మార్గదర్శకమని వక్తలు పేర్కొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: పొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# ఘనంగా కన్యకా పరమేశ్వరి ఆత్మర్పణ దినోత్సవం





**ఈసీఎల్ క్రాస్ రోడ్‌లో భక్తిశ్రద్ధలతో అమ్మవారి పూజలు – అన్నప్రసాద వితరణ**

**కాప్రా, జనవరి 20 (తెలంగాణ ముచ్చట్లు):-** వాసవి మిత్ర మండలి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఆధ్వర్యంలో శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మర్పణ దినోత్సవాన్ని మంగళవారం కాప్రా నియోజకవర్గ పరిధిలోని ఈసీఐఎల్ క్రాస్ రోడ్ వద్ద ఉన్న సాయిబాబా మందిరంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించగా, అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్పర్సన్ కల్వ సుజాత గుప్త హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ, ఆర్యవైశ్య కార్పొరేషన్ ఆధ్వర్యంలో వచ్చే నెలలో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో వేలాదిమంది ఆర్యవైశ్య ఆడపడుచులతో నిర్వహించనున్న శ్రీ కన్యకా పరమేశ్వరి పారాయణ కార్యక్రమం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించనుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమంలో ప్రతి ఒక్క ఆర్యవైశ్య బిడ్డ తప్పనిసరిగా పాల్గొని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.అన్నదాన కార్యక్రమానికి ఉప్పల అరుణ శ్రీనివాసులు గుప్త సంపూర్ణ సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఇంచార్జ్ రేబెల్లి శ్రీనివాస్ గుప్తా, వాసవి మిత్ర మండలి సభ్యులు పెద్ది నాగరాజు గుప్తా, రామిణి తిరుమలేష్ గుప్తా, గంప కృష్ణ గుప్తా, నంగునూరి అశోక్ గుప్తా, రాయల శ్రవణ్ గుప్తా, చెన్న చక్రపాణి గుప్తా, అమర కృష్ణ గుప్తా, తాటి శ్రీనివాస్ గుప్తా, మిరియాల అరుణ్ కుమార్ గుప్తా, జూపూడి ప్రసాద్ గుప్తా, ఎనిశెట్టి రమేష్ గుప్తా, పెద్ది నవీన్ గుప్తా, భగవాన్ గుప్తా, ఉప్పల ఆంజనేయులు గుప్తా, విబివి కృష్ణ గుప్తా, కోడూరి లక్ష్మణరావు గుప్తా, దిడిగం కైలాసం గుప్తా, చంద్రగిరి తారకేశ్వర్ గుప్తా, తాళ్లపెల్లి అశోక్ గుప్తా, ఇరుకుల శ్రీనివాస్ గుప్తా, పడకంటి శివ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# కీసరలో యాంటీ డ్రంక్ డ్రైవ్ క్యాంపెయిన్






- **రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం : పోలీస్ అధికారులు**

**కీసర, జనవరి 20 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "అరైవ్ అలైవ్ క్యాంపైన్-2026" కార్యక్రమంలో భాగంగా, డీజీపీ మార్గదర్శకత్వంలో కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో యాంటీ డ్రంక్ డ్రైవ్ క్యాంపెయిన్ నిర్వహించారు.కీసర పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఆర్కపల్లి ఆంజనేయులు, జవహర్ నగర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ శివ శంకర్, ఎస్ఐలు హరిప్రసాద్, నాగరాజులు సంయుక్తంగా కీసర గ్రామం ఎక్స్‌రోడ్ వద్ద ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిలో ప్రవర్తనా మార్పు తీసుకురావడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని తెలిపారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రాణాంతక మరియు ప్రాణాంతకేతర రోడ్డు ప్రమాదాలు కుటుంబాలను ఆర్థిక, మానసిక, సామాజికంగా తీవ్రంగా ప్రభావితం చేస్తాయని వివరించారు. డ్రంక్ డ్రైవ్ కారణంగా ర్యాష్ డ్రైవింగ్, అధిక వేగం, తప్పుదారి ప్రయాణం, సిగ్నల్ జంపింగ్, హెల్మెట్ లేకుండా, సీటు బెల్ట్ ధరించకుండా వాహనాలు నడపడం వంటి అంశాలు ప్రమాదాలకు దారితీస్తాయని తెలిపారు.కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాల్లో తమ కుటుంబ సభ్యులను కోల్పోయిన బాధిత కుటుంబాల అనుభవాలను ప్రజలతో పంచుకొని అవగాహన కల్పించారు. డ్రంక్ డ్రైవ్ హాట్‌స్పాట్ మార్గాల్లో ప్రయాణించే డ్రైవర్లతో నేరుగా మాట్లాడి చట్టపరమైన శిక్షలు, డ్రైవింగ్ లైసెన్స్ రద్దు, జైలు శిక్షల గురించి వివరించారు.అలాగే హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం, లేన్ క్రమశిక్షణ, సురక్షితంగా రోడ్డు దాటే విధానం వంటి అంశాలపై అవగాహన కల్పించారు."డ్రంక్ డ్రైవ్ ఒక్క వ్యక్తి జీవితానికే కాదు, మొత్తం కుటుంబ భవిష్యత్తును నాశనం చేస్తుంది" అని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని పోలీస్ అధికారులు పిలుపునిచ్చారు.






# 'అరైవ్ అలైవ్' ఉద్యమంగా మారాలి.!

- **రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి.**
- **సత్తుపల్లి ఇన్‌స్పెక్టర్ తుమ్మలపల్లి శ్రీహరి.**

**సత్తుపల్లి, జనవరి 20 (తెలంగాణ ముచ్చట్లు):** 'అరైవ్ అలైవ్' అనేది కేవలం నినాదంగా పరిమితం కాకుండా, రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతో ఒక ఉద్యమంలా ముందుకు సాగాలని సత్తుపల్లి పోలీస్ ఇన్‌స్పెక్టర్ తుమ్మలపల్లి శ్రీహరి అన్నారు. సత్తుపల్లిలోని లారీ యూనియన్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి వ్యక్తి సురక్షితంగా ఇంటికి చేరాలన్న ఆశ వారి కుటుంబ సభ్యుల్లో ఉంటుందని, రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టం జరిగితే ఆ కుటుంబాల బాధను ఎవరూ తీర్చలేరని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలు యాదృచ్ఛికంగా జరగవని, మన నిర్లక్ష్యం, అతివేగమే ప్రధాన కారణాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల అనేక కుటుంబాలు తమ ప్రధాన ఆధారాన్ని కోల్పోయి వీధిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్లు తమపై ఉన్న బాధ్యతను గుర్తించి, ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చాలని అన్నారు. మొబైల్ ఫోన్ వినియోగం, అతివేగం, రాంగ్ రూట్ డ్రైవింగ్ వంటి ప్రమాదకర చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ చేయవద్దని హెచ్చరించారు. "మీ కోసం మీ కుటుంబ సభ్యులు ఇంటివద్ద ఎదురు చూస్తున్నారు" అనే విషయాన్ని ప్రతి వాహనదారుడు గుర్తుంచుకొని జాగ్రత్తగా ప్రయాణాలు చేయాలని ప్రజలకు సందేశం ఇచ్చారు. ఈ రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాలు సత్తుపల్లి పరిధిలోని రద్దీ ప్రదేశాలు, ప్రధాన కూడళ్లతో పాటు పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## విద్యుత్ వైర్లపై ఉన్న తీగలను తొలగిస్తున్న సిబ్బంది




**కాజీపేట్ జనవరి 20 (తెలంగాణ ముచ్చట్లు3):** విద్యుత్ శాఖ ఏ ఈ చందులాల్ ఆధ్వర్యంలో ప్రజా బాట కార్యక్రమాన్ని కాజీపేటలో మంగళవారం నిర్వహించారు. ప్రజా బాట కార్యక్రమాన్ని పురస్కరించుకొని కాజీపేటలోని శాంతినగర్ కాలనీలో విద్యుత్ శాఖ బృందం విద్యుత్ వైర్లపై ఉన్న తీగలను తొలగించారు. అలాగే ట్రాన్స్ఫార్మర్ ల పరిసర ప్రాంతాల చుట్టు మొలచిన పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రపరచారు ఈ కార్యక్రమంలో స్థానిక ఏఈ చందులాల్ తో పాటు ఫోర్ మెన్ మహమ్మద్ అలీ లైన్ ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి శ్రీధర్ రెడ్డి లైన్ మెన్ రాము, శ్రీనివాస్, శ్రావణ్, బి.రాజు, సందీప్, వెంకన్న, సతీష్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## నరేందర్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన డా. జిల్లెల ఆదిత్య రెడ్డి



**వనపర్తి, జనవరి 20 (తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి మండలం చందాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నరేందర్ రెడ్డి భార్య మాధవి మృతి చెందిన విషయం గ్రామ కాంగ్రెస్ నాయకుల ద్వారా తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ఏఐపిసి అధ్యక్షులు డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి శుక్రవారం నరేందర్ రెడ్డి నివాసానికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు.ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి ని మరియు కుటుంబ సభ్యులను ఓదార్చి, ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని మనోధైర్యం చెప్పారు. మాధవి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ అధ్యక్షులు సమద్ మియా, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఏఐపిసి అధ్యక్షులు నాగార్జున, వనపర్తి మండల్ కిసాన్ సెల్ అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి, గోపాల్‌పేట్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ జిల్లెల ప్రవీణ్ రెడ్డి, వనపర్తి పట్టణ ప్రధాన కార్యదర్శి బాబా, వనపర్తి మండల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆవుల చంద్రశేఖర్, వనపర్తి మండల్ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు ఎత్తం చరణ్ రాజ్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి తృతీయ వార్షికోత్సవంలో పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు



**ఉప్పల్, జనవరి 21 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం చిల్కానగర్ డివిజన్ పరిధిలోని బ్రహ్మంగారి గుట్టపై నిర్వహించిన శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి తృతీయ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన స్వామివారి కల్యాణ మహోత్సవంలో ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.మంగళవారం ఘనంగా నిర్వహించిన ఈ కల్యాణ మహోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి రచించిన కాలజ్ఞానం ప్రజలకు మంచి-చెడుల మధ్య, ధర్మ-అధర్మాల మధ్య తేడాను తెలియజేసే గొప్ప గ్రంథంగా ప్రసిద్ధి చెందిందన్నారు. స్వామి కేవలం భవిష్యత్తును చెప్పినవాడే కాకుండా, ప్రజలను సన్మార్గంలో నడిపించిన మహానీయుడని కొనియాడారు.నిజాయితీగా జీవించడం, ఇతరులకు సహాయం చేయడం, భక్తి మరియు క్రమశిక్షణతో ఉండడం వంటి విలువలను స్వామి తన బోధనల ద్వారా ప్రజలకు అందించారని, ఆయన ఉపదేశాలు నేటికీ మన జీవితాలకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయన్నారు.ఈ కార్యక్రమంలో కొంపల్లి బాలరాజ్, ఆగం రెడ్డి, చిల్కానగర్ డివిజన్ అధ్యక్షుడు ములకలపల్లి రాజేష్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి మహేందర్ ముదిరాజ్, నారోజు రాధాకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ మంచాల రఘు, ఉపాధ్యక్షులు గండికోట గణేష్, బీసీ సెల్ అధ్యక్షుడు దండుగుల శంకర్, అలాగే సౌదారపు శివ, జగదీష్ ముదిరాజ్, డేవిడ్, కిరణ్, ఫహీం తదితరులు మరియు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## తెలంగాణ ముచ్చట్లు దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరించిన తుమ్మల యుగంధర్



**ఖమ్మం బ్యూరో,జనవరి 20 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ముచ్చట్లు దినపత్రిక క్యాలెండర్‌ను రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో పత్రికల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ప్రజల సమస్యలను నిష్పక్షపాతంగా వెలుగులోకి తీసుకురావడంలో పత్రికలు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజలకు ఉపయోగపడే సమాచారాన్ని అందిస్తూ, సమకాలీన అంశాలపై స్పష్టతనిచ్చే విధంగా తెలంగాణ ముచ్చట్లు దినపత్రిక ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ ముచ్చట్లు దినపత్రిక బ్యూరో చీఫ్ మదార్ సాహెబ్, కాంగ్రెస్ జిల్లా నాయకులు ఆసిఫ్, రిపోర్టర్ నజీర్ , రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక


# తెలంగాణ ముచ్చట్లు క్యాలెండర్ ఆవిష్కరించిన డాక్టర్ భరత్ బాబు

**ఖమ్మం బ్యూరో, జనవరి 20 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజా సమస్యలకు ప్రతిబింబంగా నిలుస్తున్న తెలంగాణ ముచ్చట్లు దినపత్రిక క్యాలెండర్-2026ను ప్రశాంతి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ యంగ్ అండ్ డైనమిక్ డాక్టర్ కేసోజు భరత్ బాబు (ఎండి జనరల్ మెడిసిన్) ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగ పడే వార్తలు, సమకాలీన అంశాలతో పత్రిక ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ప్రజా సమస్యలను నిష్పక్షపాతంగా వెలుగులోకి తీసుకురావడంలో పత్రిక పాత్ర అభినంద నీయమని పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. తెలంగాణ ముచ్చట్లు పత్రిక మరింత ప్రజాదరణ పొందాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ చింతపల్లి రాజ్ కుమార్, ప్రశాంతి హాస్పిటల్ మేనేజర్ మధు, డాక్టర్ ఇమామ్, తెలంగాణ ముచ్చట్లు ఖమ్మం బ్యూరో మదార్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.



## స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా కుషాయిగూడలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్



**కాప్రా, జనవరి 20 (తెలంగాణ ముచ్చట్లు):** స్వచ్ఛ సర్వేక్షన్ ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఆరుబయట మలమూత్ర విసర్జన చేసే వారు, చెత్తాచెదారాన్ని రోడ్లపై విచ్చలవిడిగా పడేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. ఈ నేపథ్యంలో కుషాయిగూడ ప్రాంతంలోని డీ-మార్ట్ ఓపెన్ ఏరియా పరిధిలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు.ఈ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఆరుబయట మూత్ర విసర్జన చేసిన వారికి పెనాల్టీలు విధించారు. ఈ కార్యక్రమంలో కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీహరి, డీ-సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అధికారి రవి, సానిటరీ సూపర్వైజర్ సుదర్శన్, ఎస్ఎఫ్ఏ కే.లక్ష్మి, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.నిబంధనలు ఉల్లంఘించిన వారికి పెనాల్టీ విధించడమే కాకుండా, పూలదండ వేసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి ప్రజల్లో అవగాహన కల్పించే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరుబయట మల మూత్ర విసర్జన వల్ల ప్రజారోగ్యానికి కలిగే అనర్థాలు, పరిసరాల కాలుష్యం గురించి ప్రజలకు వివరించామని డిప్యూటీ కమిషనర్ శ్రీహరి తెలిపారు. ప్రజలు స్వచ్ఛత నిబంధనలు పాటిస్తూ పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని ఆయన కోరారు.

## అక్రమ జూదం, కోడిపందాలపై ఉక్కుపాదం

- **కల్లూరు సబ్‌డివిజన్ ఏసీపీ వసుంధరా యాదవ్ ఆధ్వర్యంలో కఠిన చర్యలు.**



**సత్తుపల్లి, జనవరి 20 (తెలంగాణ ముచ్చట్లు):** కల్లూరు సబ్‌డివిజన్ పరిధిలో కోడిపందాలు, జూదం వంటి అక్రమ కార్యకలాపాలపై ఏసీపీ ఐపీఎస్ వసుంధరా యాదవ్ ఆధ్వర్యంలో పోలీసులు ఉక్కుపాదం మోపారు. సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకుని ఈ నెలలో సత్తుపల్లి పోలీసులు విశ్వసనీయ సమాచారం, క్షేత్రస్థాయి నిఘా ఆధారంగా విస్తృత తనిఖీలు నిర్వహించారు.

ఈ చర్యల ఫలితంగా 77 మందిని పట్టుకుని బైండోవర్ చేయగా, సంబంధిత చట్టాల ప్రకారం 17 కేసులు నమోదు చేశారు. అలాగే ₹61,285 నగదును స్వాధీనం చేసుకున్నారు. కోడిపందాలకు వినియోగిస్తున్న 12 కోళ్లు, 6 పదునైన ఆయుధాలు, 50 మోటార్ సైకిళ్లు, 28 సెల్‌ఫోన్లు, పందెం స్లిప్‌లు మరియు జూద సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పలు అక్రమ జూద స్థావరాలను గుర్తించి మూసివేశారు.

డ్రోన్ కెమెరాలతో నిఘా.

మెరుగైన పర్యవేక్షణలో భాగంగా అనుమానిత ప్రదేశాలు, అటవీ ప్రాంతాలు, సరిహద్దు గ్రామాల్లో డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా ఏర్పాటు చేశారు. దీని వల్ల అక్రమ కార్యకలాపాలను సకాలంలో గుర్తించి సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం సాధ్యమైందని పోలీసులు తెలిపారు.

గ్రామీణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాలు, అటవీ, సరిహద్దు ప్రాంతాల్లో ఈ ఆపరేషన్లు సజావుగా కొనసాగాయి. ప్రజా శాంతికి భంగం కలిగించే, చట్టవిరుద్ధ సమావేశాలను ప్రోత్సహించే కార్యకలాపాల పట్ల జీరో టాలరెన్స్ విధానం అమలు చేస్తున్నట్లు ఏసీపీ స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, ప్రత్యేక బృందాలు, క్షేత్ర సిబ్బంది చూపిన వృత్తి నైపుణ్యం, అప్రమత్తత, అంకితభావాన్ని ఆమె అభినందించారు. కోడిపందాలు, జూదం వంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే నిర్వాహకులు, పాల్గొనేవారు, సహాయకులు ఎవరికీ ఉపేక్ష ఉండదని హెచ్చరించారు.

కోడిపందాలు, జూదం శిక్షార్హమైన నేరాలని ప్రజలు గుర్తించాలని, ఇటువంటి చర్యలపై పోలీసులు నిరంతరంగా దాడులు కొనసాగిస్తారని తెలిపారు. పౌరులు సమాచారం అందించేందుకు ముందుకు రావాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పోలీసులు భరోసా ఇచ్చారు.

శాంతిభద్రతలకు కట్టుబాటు.

శాంతిభద్రతలను కాపాడటానికి, సామాజిక సామరస్యాన్ని పరిరక్షించడానికి, చట్టబద్ధతను నిలబెట్టేందుకు కల్లూరు సబ్‌డివిజన్ పోలీసులు కట్టుబడి ఉన్నారని అధికారులు స్పష్టం చేశారు.

## సత్తుపల్లి ఏరియా ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్‌గా బిజ్జా కోటేశ్వర్ రావు నియామకం



**సత్తుపల్లి, జనవరి 20 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి ఏరియా సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్‌గా బిజ్జా కోటేశ్వర్ రావును నియమించారు. ఈ మేరకు ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జనక్ ప్రసాద్ మాట్లాడుతూ, సత్తుపల్లి ఏరియాలో ఐఎన్‌టీయూసీని మరింత బలోపేతం చేసి, కార్మికుల హక్కుల సాధనలో చురుకైన పాత్ర పోషించాలని కోటేశ్వర్ రావుకు సూచించారు. ప్రతి కార్మికుడి సమస్యను యాజమాన్య దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాల్సిన బాధ్యతను సమర్థంగా నిర్వహించాలని తెలిపారు. వైస్ ప్రెసిడెంట్‌గా నియామకమైన సందర్భంగా కోటేశ్వర్ రావు మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యత అప్పగించిన యూనియన్ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అధ్యక్షుడు డా. జి. సంజీవ రెడ్డి, సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజన్, కొత్తగూడెం వైస్ ప్రెసిడెంట్ రజాక్‌లకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల అమలు, భద్రతా ప్రమాణాల మెరుగుదల కోసం ఐఎన్‌టీయూసీ తరపున నిరంతరం పోరాటం చేస్తానని ఆయన స్పష్టం చేశారు.





## జిల్లాలలో స్వయం సహాయక సంఘాల ద్వారా నడిపిస్తున్న యూనిట్లను సందర్శించిన జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుల టీం

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో 20 (తెలంగాణ ముచ్చట్లు):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ వారి సూచన మేరకు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీ లత జిల్లా విజిలెన్స్ మరియు మానిటరింగ్ కమిటీ సభ్యులతో కలిసి జిల్లాలలోని స్వయం సహాయక సంఘాలు నడుపుతున్న యూనిట్స్ లను సందర్శించి నాము ఇందులో భాగంగా పాల్వంచలోని చరిత ఆర్గానిక్ ఉత్పత్తులు మరియు కౌజు పిట్టల పెంపకం నాగారం గ్రామంలోని కొర్రమీనల పెంపకం మరియు చేపల పెంపకం యూనిట్ బూర్గంపాడు మండలంలోని మొరంపల్లి బంజర్ లోని సేంద్రియ ఎరువులతో కూరగాయల సాగు చేస్తున్న యూనిట్ ను లక్ష్మీదేవి పల్లి మండలంలోని లోతు వాగులో నాటు కోళ్లు బాతుల పెంపకము యూనిట్స్ మరియు చంద్రుగొండ మండలం బెండలపాడు గ్రామంలోని వెదురు బొంగులతో వస్తువులు ఫర్నిచర్ తయారు చేసే యూనిట్స్ లను సందర్శించినాము ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి శ్రీమతి శ్రీలత మరియు జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ లకావత్ వెంకటేశ్వర్లు లావుడియా సామ్యా నాయక్ లక్ష్మీబాయి మరియు కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ ఆర్ వి ఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు





## హిమాయత్‌నగర్‌లో మహవీర్ బ్యాంక్ 11వ శాఖ ప్రారంభం

**హైదరాబాద్, జనవరి 20 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రముఖ సహకార బ్యాంకింగ్ సంస్థ మహవీర్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ తన సేవలను మరింత విస్తరించింది. నగరంలోని హిమాయత్‌నగర్‌లో బ్యాంక్ 11వ శాఖను సోమవారం ఘనంగా ప్రారంభించారు.

ఈ నూతన శాఖను మోతీలాల్ జీ భాల్గట్ ప్రారంభించగా, ముఖ్య అతిథిగా కాంతీలాల్ నహర్ హాజరయ్యారు. కార్యక్రమంలో సుశీల్ కపాడియా, ఉదయ్ మోర్, హనుమాన్ దాస్ మాలు, బ్యాంక్ డైరెక్టర్ల బోర్డు సభ్యులు, మేనేజ్‌మెంట్ ప్రతినిధులు, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్యాంక్ చైర్మన్ అశోక్ కొఠారి మాట్లాడుతూ, హిమాయత్‌నగర్ శాఖ ప్రారంభం మహవీర్ బ్యాంక్ విస్తరణలో కీలక మైలురాయిగా పేర్కొన్నారు. కస్టమర్ల నమ్మకం, పారదర్శకత, నాణ్యమైన సేవలే బ్యాంక్ పురోగతికి మూలస్తంభాలని తెలిపారు. భవిష్యత్తులోనూ ఇదే నిబద్ధతతో సేవలందిస్తామని హామీ ఇచ్చారు. సీనియర్ వైస్ చైర్మన్ హరినారాయణ్ వ్యాస్ మాట్లాడుతూ, ఈ నూతన శాఖ ద్వారా స్థానిక ప్రజలకు, ముఖ్యంగా వ్యాపారవర్గాలకు ఆధునిక బ్యాంకింగ్ సేవలు మరింత చేరువవుతాయని అన్నారు. ఇది ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కైలాస్, సోహన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.






## ఆర్‌యూబి పనులతో మల్కాజ్‌గిరి ఆనంద్‌బాగ్ మార్గంలో ట్రాఫిక్ అవస్థలు

**మల్కాజ్‌గిరి, జనవరి 20 (తెలంగాణ ముచ్చట్లు):** ఆర్‌యూబి నిర్మాణ పనుల నేపథ్యంలో మల్కాజ్‌గిరి నుంచి ఆనంద్‌బాగ్‌కు వెళ్లే ప్రధాన రహదారిని తాత్కాలికంగా మూసివేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ప్రత్యామ్నాయంగా రాఘవేంద్ర థియేటర్ వైపు నుంచి ఆనంద్‌బాగ్‌కు వెళ్లే రోడ్డుపై వాహనాల రాకపోకలు అధికమై అక్కడ తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతోంది. ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు పోలీసులు ఈ మార్గంలో కేవలం ద్విచక్ర వాహనాలకే అనుమతి ఉంటుందని సూచిస్తూ బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే వాటిని పట్టించుకోకుండా ఆటోలు, కార్లు కూడా అదే మార్గంలో వెళ్లడంతో రద్దీ మరింత పెరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.ప్రత్యేకంగా కార్యాలయాల ప్రారంభ, ముగింపు సమయాల్లో ట్రాఫిక్ జామ్ తీవ్రంగా మారుతుండటంతో పాఠశాల వాహనాలు, అత్యవసర సేవల వాహనాలు సైతం నిలిచిపోతున్నాయి. ఈ నేపథ్యంలో రాఘవేంద్ర థియేటర్ సమీపంలోనే ఆటోలు, కార్లను పోలీసులు అడ్డుకుని మళ్లిస్తే ట్రాఫిక్ సమస్య కొంతవరకు తగ్గే అవకాశం ఉందని వాహనదారులు కోరుతున్నారు.ఈ విషయంపై ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటే ప్రజలకు ఉపశమనం కలుగుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# భగాయత్‌లో అభివృద్ధి పనులకు మోక్షం కలిగింది





- రూ.10 కోట్లతో స్పోర్ట్స్ కాంప్లెక్స్, రూ.3 కోట్లతో కమ్యూనిటీ హాల్‌కు ప్రతిపాదనలు
- కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డితో కలిసి అధికారుల పర్యటన

**ఉప్పల్, జనవరి 20 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ భగాయత్ లే అవుట్‌లో ఎన్నేళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్యలకు త్వరలోనే శాశ్వత పరిష్కారం లభించనుంది. అదే సమయంలో స్థానికులు ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న అభివృద్ధి పనులకు మోక్షం కలగనుంది.ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి సోమవారం హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫ్ రాజ్ అహ్మద్‌ను కలిసి భగాయత్ లే అవుట్‌లోని సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, రహదారుల మరమ్మతులు తదితర అంశాలను వివరించారు. ఈ భేటీతోనే యంత్రాంగం స్పందించి క్షేత్రస్థాయిలో చర్యలు ప్రారంభించింది.మంగళవారం హెచ్ఎండీఏ, వాటర్ వర్క్స్, జీహెచ్ఎంసీ అధికారులు ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి, మందుముల పరమేశ్వర్ రెడ్డితో కలిసి భగాయత్ లే అవుట్‌లో విస్తృతంగా పర్యటించారు. కాలనీలోని వీధులు, మౌలిక వసతులను పరిశీలిస్తూ స్థానికుల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు.ఈ సందర్భంగా రూ.10 కోట్లతో ఆధునిక స్పోర్ట్స్ కాంప్లెక్స్, రూ.3 కోట్లతో కమ్యూనిటీ హాల్ నిర్మాణంతో పాటు అంతర్గత రోడ్ల అభివృద్ధికి సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వీలైనంత త్వరగా టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. అంతవరకు అత్యవసరంగా అవసరమైన రహదారుల మరమ్మతు పనులు చేపడతామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎండీఏ డీఈ సత్యప్రసాద్, ఏఈ వెంకటేష్, జీహెచ్ఎంసీ డీఈ వెన్నెల్ గౌడ్, ఏఈ రాజ్‌కుమార్, ఎలక్ట్రికల్ డీఈ అనిత, సానిటేషన్ ఏఈ పుష్పలత పాల్గొన్నారు. అలాగే భగాయత్ కాలనీ సభ్యులు శ్రీనివాస్ రావు, సుధాకర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, రాంచందర్ రెడ్డి, వంశీదర్ రెడ్డి, సూర్య గోపాల్, శ్రీపతి రావు, ఈగ సంతోష్ ముదిరాజ్, నిధనకవి సుధాకర్, పూజల ప్రభాకర్, సోమ్ జంగయ్య, సల్లా ప్రభాకర్ రెడ్డి, విప్లవ్ రెడ్డి, బండారి శ్రీనివాస్ గౌడ్, సచిత్, రవీందర్ రావు, చారి, విజయ్, చంద్రశేఖర్ రెడ్డి, సంగమేశ్వర్ రెడ్డి, రంగనాథ్, అంజి రెడ్డి, అర్షద్, మహేష్, మూర్తి, వినయ్, దుర్గ ప్రసాద్, నవీన్, దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# మైనార్టీ గురుకులాల ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలి..



- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం బ్యూరో, జనవరి - 20 (తెలంగాణ ముచ్చట్లు):** జిల్లా మైనార్టీ గురుకుల పాఠశాలల ప్రవేశాల కోసం, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరాలనుకునే వారు వెంటనే ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పేర్కొన్నారు.
తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ ( టీజీ ఎంఆర్ఐఇఎస్) ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను మైనారిటీ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా *జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ* మైనారిటీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో గురుకుల విద్యాలయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. అర్హత కలిగిన మైనారిటీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అడ్మిషన్ల ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా నిర్వహించబడుతుందని అన్నారు. ఇంటర్మీడియట్ తో పాటు, 6, 7, 8 తరగతుల్లో ఉన్న బ్యాక్ లాగ్ ఖాళీలను కూడా భర్తీ చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ అడ్మిషన్లకు సంబంధించి గడువులోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎం.డి. ముజాహిద్, తెలంగాణ మైనారిటీ విద్యాసంస్థల ప్రాంతీయ కో ఆర్డినేటర్ ఎం.జె. అరుణ కుమారి, గురుకుల పాఠశాలల, కళాశాలల ప్రిన్సిపాల్ లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బైరి నవీన్ గౌడ్ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం






- 150 మందికి పైగా రక్తదానం చేసిన యువత

**కాప్రా, జనవరి 20 (తెలంగాణ ముచ్చట్లు):** బైరి నవీన్ గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకుని కాప్రా డివిజన్ పరిధిలోని ఎల్లరెడ్డిగూడలో మంగళవారం టీమ్ బీఎల్ఆర్ & బీఎన్జీ యువసేన ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ శిబిరాన్ని ముడిగొండ కాశీనాథ్ సమన్వయంతో ఏర్పాటు చేయగా, యువతతో పాటు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ శిబిరంలో 150 మందికి పైగా స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవతా భావాన్ని చాటుకున్నారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన రోగులకు ఈ రక్తదానం ఎంతో ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు. రక్తదానం ద్వారా ఒకరి ప్రాణాన్ని కాపాడే అవకాశం ఉంటుందని పేర్కొంటూ, ఇలాంటి సేవా కార్యక్రమాల్లో యువత చురుకుగా పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. రక్తదాన శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించడంలో టీమ్ బీఎల్ఆర్ & బీఎన్జీ యువసేన సభ్యులు కీలక పాత్ర పోషించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు అబ్దుల్ గాఫుర్, స్నేహ, వెంకట్, రేణుక తదితరులు పాల్గొని వైద్య సేవలు అందించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు రక్తదాతలను అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు.

# మల్లాపూర్ డివిజన్ సమస్యలపై అధికారులతో గ్రేటర్ కాంగ్రెస్ నేతల భేటీ



**మల్లాపూర్, జనవరి 20 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం మల్లాపూర్ వార్డు కార్యాలయంలో నాచారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ నిత్యానంద్‌ను గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మల్లాపూర్ డివిజన్‌లో నెలకొన్న పలు ప్రజా సమస్యలు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై విస్తృతంగా చర్చించారు. సమస్యల పరిష్కారానికి సంబంధించి వినతి పత్రాలను డిప్యూటీ కమిషనర్‌కు అందజేశారు. అనంతరం మల్లాపూర్ ఏఈ సూరజ్‌ను కలిసిన నెమలి అనిల్ కుమార్, కె.ఎల్. రెడ్డి నగర్ మరియు ఎస్.వి. నగర్ కాలనీల్లోని పార్కులు, ఓపెన్ జిమ్స్ అభివృద్ధి పనుల పురోగతిపై వివరంగా చర్చించారు. కాలనీల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపర్చాల్సిన అవసరాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం లభించేలా అధికారుల సహకారంతో తక్షణ చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజల తరపున పోరాటం చేస్తుందని నెమలి అనిల్ కుమార్ తెలిపారు.

# లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 800 రోజులకు చేరిన 'మీల్స్ ఆన్ వీల్స్'





**సత్తుపల్లి, జనవరి 20 (తెలంగాణ ముచ్చట్లు):** నిరుపేదల ఆకలి తీర్చడమే ధ్యేయంగా సత్తుపల్లి లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన 'మీల్స్ ఆన్ వీల్స్' కార్యక్రమం మంగళవారం నాటికి 800 రోజులకు చేరింది. సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రి, బస్టాండ్ కేంద్రాల్లో ప్రతిరోజు ఉదయం 7.30 గంటలకల్లా సుమారు 150 మందికి అల్పాహారం అందిస్తూ ఈ సేవా కార్యక్రమం నిరంతరంగా కొనసాగుతోంది.
ఈ కార్యక్రమం 800వ రోజు సందర్భంగా సత్తుపల్లి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జె.ఎన్. శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రమశిక్షణ, సమయపాలనతో ప్రతిరోజు ఉదయం కేపీఆర్ గౌతమ్ స్కూల్లో అల్పాహారం వండించి, ప్రత్యేక వాహనం ద్వారా యాచకులు, రోగులు, వృద్ధులు, నిరుపేదలకు సకాలంలో వడ్డించడం అభినందనీయమన్నారు. పేదల ఆకలి మంటలను ఆర్పే ఈ సేవలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు, బస్టాండ్ కేంద్రంలో యాచకులు, వృద్ధులు, నిరుపేదలకు లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతిరోజు అల్పాహారం అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ అధ్యక్షులు గోగడ రవికుమార్, మందపాటి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. దాతల సహకారంతో ఈ సేవా కార్యక్రమాన్ని ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి డివిజన్ ప్రైవేట్ పాఠశాలల సంఘం (ట్రస్మా) అధ్యక్షులు పసుపులేటి నాగేశ్వర రావు, లైన్స్ క్లబ్ బాధ్యులు కొత్తూరు సత్యనారాయణ, దొడ్డ కృష్ణయ్య, చెన్నారెడ్డి, పెనుగొండ రమేష్, రమణ, సలీం, శ్రీను, వలి, యూనిస్, పాషా పాల్గొన్నారు.



# ఖమ్మం జర్నలిస్టులకు కేటాయించిన భూమికి సుప్రీం కోర్టు తీర్పు వర్తించదు



- మీడియా అకాడమీ చైర్మన్

**ఖమ్మం బ్యూరో, జనవరి 20(తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మం జిల్లాలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం గత ప్రభుత్వం ప్రత్యేక జీవో, క్యాబినెట్ ఆమోదంతో కేటాయించిన 23.02 ఎకరాల భూమికి సుప్రీంకోర్టు తీర్పు వర్తించదని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. టిడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు టి. సంతోష్ చక్రవర్తి ఆధ్వర్యంలో జిల్లా కమిటీ సమర్పించిన వినతిపత్రానికి స్పందిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఖమ్మం నగరంలోని స్థానిక ఎస్.ఆర్. గార్డెన్‌లో జర్నలిస్టుల బృందాన్ని కలిసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య స్థానిక మంత్రుల స్థాయిలోనే పరిష్కారమయ్యే అంశమని, ఇందుకు తన పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు విలాసం కాదని, జీవన భద్రతకు సంబంధించిన మౌలిక అవసరమని పేర్కొన్నారు.
ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు టి.ఎస్. చక్రవర్తి మాట్లాడుతూ, 23.02 ఎకరాల భూమిపై సుప్రీంకోర్టు తీర్పు వర్తిస్తుందన్న అయోమయం మీడియా అకాడమీ చైర్మన్ వ్యాఖ్యలతో పూర్తిగా తొలగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కాలయాపన లేకుండా భూమిని జర్నలిస్టులకు అప్పగించాలని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, జిల్లా కోశాధికారి అర్వపల్లి నగేష్, (టీబీజేఏ) జిల్లా అధ్యక్షులు వందనపు సామ్రాట్ గుప్తా, వీడియో జర్నలిస్ట్ అధ్యక్షులు ఉపేందర్, జిల్లా సంయుక్త కార్యదర్శి కుంభం రవి కుమార్ , పట్టణ అధ్యక్షులు గేంటెల కుమార్, కార్యదర్శి నాయిని స్వాతి, ఎలెక్ట్రానిక్ మీడియా నగర అధ్యక్షుడు ఎలుగోటి వెంకట్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంతోటి శ్రీనివాస్, కార్యదర్శి మల్లెల శిల్ప, సభ్యులు చిన్నంశెట్టి రాంబాబు, కరాటే వేణు, కొండలరావు, జగదీష్, మధు, కందరబోయిన నాగకృష్ణ, శ్రీధర్, సొందుమియా, కిరణ్, పొదిలపు సంతోష్ కుమార్, రాకేష్, వేములకొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అవినీతి, అటెన్షన్ డైవర్షన్ రాజకీయాలు బహిర్గతం చేస్తాం: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)




ప్రభుత్వం ఇచ్చిన నోటీసులకు బాధ్యతాయుతమైన నాయకుడిగా హరీష్ రావు మంగళవారం హాజరయ్యారని పేర్కొన్నారు. నోటీసులు, సిట్ విచారణల పేరుతో ఎన్ని అటెన్షన్ డైవర్షన్‌లు చేసినా కాంగ్రెస్ హామీల వైఫల్యం, పరిపాలన లోపాలపై ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేస్తూ, డబ్బుల కట్టలతో దొరికిన నేరచరిత్రను ఇతరులపై అంటించేందుకు ప్రయత్నిస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. అధికారం అందలం ఎక్కినా బుద్ధి మారలేదని, కాంగ్రెస్ అంటేనే స్కాంల రాజకీయమని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ అంశంలో ఇప్పటివరకు ఒక్క అధికారిక ప్రకటన కూడా రాలేదని, కేవలం లీకులిచ్చి ఎంతకాలం ప్రజలను మభ్యపెడతారని ప్రశ్నించారు. గతంలో హరీష్ రావుపై ఉన్న అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసును సుప్రీంకోర్టు కొట్టివేసిందని గుర్తు చేశారు.

సింగరేణి టెండర్ల అంశంలో కీలక ఆరోపణలు చేస్తూ, ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డి కేంద్రంగా టెండర్ల రిగ్గింగ్ జరిగిందని కేటీఆర్ అన్నారు. తొమ్మిది టెండర్లపై కుటుంబ నియంత్రణ ఉందని, మైనస్ టెండర్లు పడే చోట అంచనా విలువకన్నా అధికంగా టెండర్లు వేయించారని ఆరోపించారు. సైట్ విజిట్ సర్టిఫికెట్ వంటి అడ్డగోలు నిబంధనలతో కంపెనీలను బెదిరించారని, అర్హులైన సంస్థలకు సర్టిఫికెట్లు ఇవ్వలేదని తెలిపారు. ఈ మొత్తం వ్యవహారంపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ వేయాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిసారి అవినీతి బయటపడితే అటెన్షన్ డైవర్షన్‌కు పాల్పడుతుందని కేటీఆర్ విమర్శించారు. అసెంబ్లీలోనే మంత్రులను ఎదుర్కొన్న హరీష్ రావును నలుగురు పోలీసుల ముందు కూర్చోబెట్టినా భయపడేది లేదన్నారు. న్యాయస్థానాలపై తమకు పూర్తి నమ్మకం ఉందని, వెయ్యి నోటీసులు ఇచ్చినా, వంద సిట్‌లు వేసినా ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా తమ పార్టీ నిలుస్తుందని, మరో రెండు సంవత్సరాల తర్వాత తిరిగి తమ ప్రభుత్వమే వస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

# సినిమా టికెట్ ధరల పెంపుపై తెలంగాణ హైకోర్టు సంచలన ఆదేశాలు




**హైదరాబాద్, జనవరి 20 (తెలంగాణ ముచ్చట్లు):** సినిమా టికెట్ ధరల పెంపుకు సంబంధించి తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇకపై సినిమా టికెట్ ధరల పెంపుకు సంబంధించిన ఉత్తర్వులు కనీసం 90 రోజుల ముందే ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు జారీ చేసే జీఓలు ముందస్తు ప్రణాళికతో, పారదర్శకంగా ఉండాలని కోర్టు స్పష్టం చేసింది.

కోర్టు సెలవు రోజుల్లో విష్ణు మంచు (మన శంకర వరప్రసాద్) సినిమా టికెట్ ధరలు పెంచుతూ ప్రభుత్వం జీఓ జారీ చేసిందని పేర్కొంటూ ఓ న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా సెలవుల సమయంలో తీసుకున్న నిర్ణయాలపై కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. టికెట్ ధరల పెంపు వల్ల సామాన్య ప్రేక్షకులపై భారం పడుతుందని, అలాంటి నిర్ణయాలు తొందరపాటు గా కాకుండా ముందస్తు నోటీసులతో తీసుకోవాల్సిన అవసరం ఉందని కోర్టు వ్యాఖ్యానించింది. ప్రజా ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోకుండా తీసుకునే నిర్ణయాలను అనుమతించబోమని స్పష్టం చేసింది. ఇకపై సినిమా టికెట్ ధరల పెంపు అంశంలో ప్రభుత్వం స్పష్టమైన విధానంతో ముందుకు వెళ్లాలని, నిబంధనలకు లోబడి నిర్ణయాలు తీసుకోవాలని తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పు సినిమా పరిశ్రమతో పాటు ప్రేక్షకుల్లోనూ ప్రాధాన్యత సంతరించుకుంది.

# నాగర్‌కర్నూల్‌లో కరెంట్ షాక్‌తో విద్యార్థి మృతి

- పాఠశాల ప్రహరీ గోడ వద్ద విషాద ఘటన
- చికిత్సకు తరలించేలోపే మృతి నిర్ధారణ
- విద్యుత్ శాఖ నిర్లక్ష్యంపై స్థానికుల ఆరోపణలు



**నాగర్‌కర్నూల్, జనవరి 20 (తెలంగాణ ముచ్చట్లు):** నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని ఇంద్రకల్ గ్రామంలో కరెంట్ షాక్‌తో విద్యార్థి మృతి చెందిన విషాద ఘటన మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మల్లేష్, లక్ష్మమ్మ దంపతుల పెద్ద కుమారుడు లోకేష్ (14) స్థానిక ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు.

రోజువారీగా పాఠశాలకు వెళ్లిన లోకేష్, మూత్ర విసర్జన కోసం వెళ్లి పాఠశాల ప్రహరీ గోడకు ఆనుకుని ఉన్న స్తంభానికి ఏర్పాటు చేసిన బిగు వైర్‌ను తాకాడు. అప్పటికే ఆ వైర్‌కు విద్యుత్ సరఫరా ఉండటంతో తీవ్ర షాక్ తగిలి అక్కడికక్కడే కుప్పకూలాడు.

ఘటనను గమనించిన తోటి విద్యార్థులు వెంటనే ఉపాధ్యాయులకు సమాచారం ఇచ్చారు. ఉపాధ్యాయులు లోకేష్‌ను కారులో నాగర్‌కర్నూల్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ వార్తతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరై విలపించారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పాఠశాల పరిసరాల్లో బహిరంగంగా కరెంట్ ప్రవహించే వైర్లు ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తక్షణ భద్రతా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# మానవత్వపు విలువల పరిరక్షణే లక్ష్యం

- నేటి నుంచి జమాతే ఇస్లామీ హింద్ చైతన్య కార్యక్రమాలు

**ఖమ్మం బ్యూరో, జనవరి 20(తెలంగాణ ముచ్చట్లు)**




సమాజంలో వేగంగా క్షీణిస్తున్న నైతిక విలువలను పునరుద్ధరించడానికి, యువతను పెడదోవ పట్టిస్తున్న సామాజిక రుగ్మతలపై సమరం చేయడానికి 'జమాతే ఇస్లామీ హింద్' (జేఐహెచ్) టోలిచౌకి విభాగం నడుం బిగించింది. 'మానవ గౌరవాన్ని కాపాడదాం' (ఎహతెరామ్‌యేఇన్సానియత్) అనే నినాదంతో ఈ నెల 20 నుంచి 31 వరకు 12 రోజుల పాటు ప్రత్యేక అవగాహన ప్రచారాన్ని నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధులు వెల్లడించారు.

ఈ ప్రచార కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి టోలిచౌకి జమాతే ఇస్లామీ హింద్ ప్రెసిడెంట్ షుజాతుల్లా హుస్సేన్, అబ్దుల్ మాజిద్ మరియు ఇతర ప్రతినిధులు మంగళవారం స్థానిక ఎస్ హెచ్ ఓ రమేష్ నాయక్ గారిని కలిశారు. ఈ సందర్భంగా కార్యక్రమ వివరాలను వివరిస్తూ వారికి వినతి పత్రం సమర్పించి, అనుమతి కోరారు.

**మత్తు మహమ్మారిపై పోరు**

నగర జీవితాన్ని పట్టిపీడిస్తున్న మత్తు పదార్థాల వినియోగం, పెరుగుతున్న హింస, నేర ప్రవృత్తి వంటి అంశాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా ఉండేలా పాఠశాలలు, కళాశాలలు, కోచింగ్ సెంటర్లు, జిమ్‌లలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయనున్నారు.

**ప్రచారంలో ప్రధానాంశాలు:**


నైతిక విలువలపై ప్రసంగాలు: మానవ గౌరవం, సామాజిక బాధ్యతపై నిపుణులతో చర్చా కార్యక్రమాలు.

క్షేత్రస్థాయి అవగాహన: మురికివాడల్లో జీవన నైపుణ్యాల శిక్షణ, ఆటో డ్రైవర్లు, కార్మిక సంఘాలతో ప్రత్యేక భేటీలు.

వ్యసన విముక్తి: వ్యసనాల నుంచి బయటపడిన వారి అనుభవాలను పంచుకుంటూ యువతలో మార్పు తెచ్చే ప్రయత్నం.

చైతన్య ర్యాలీ: మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా స్థానిక ప్రజలతో కలిసి భారీ అవగాహన ర్యాలీ నిర్వహణ.

కేవలం ఉపన్యాసాలకే పరిమితం కాకుండా, స్థానికంగా కమిటీలను ఏర్పాటు చేసి నిరంతరం సామాజిక పర్యవేక్షణ జరిగేలా ప్రణాళిక రూపొందించారు. ఈ కార్యక్రమాలన్నీ శాంతియుత వాతావరణంలో, ఎటువంటి రాజకీయ ప్రమేయం లేకుండా నిర్వహిస్తున్నట్లు ప్రెసిడెంట్ షుజాతుల్లా హుస్సేన్ పేర్కొన్నారు.



# స్టేషన్ ఘనపూర్ మున్సిపల్ పోరుకు జనసేన సిద్ధం

- జనసేనపార్టీ ఇంచార్జ్ గాదె పృథ్వీ

**స్టేషన్ ఘనపూర్, జనవరి20 (తెలంగాణ ముచ్చట్లు) :** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో జనసేనపార్టీ పోటీ చేస్తుందని జనసేనపార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ గాదె పృథ్వీ తెలిపారు. డివిజన్ కేంద్రంలో మంగళవారం జనసైనికులతో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి పార్టీ మున్సిపల్ ఎన్నికల ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ మాదిరెడ్డి దామోదర్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మున్సిపాలిటీలో అన్నీ స్థానాల్లో జనసేన పోటీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. గెలుపే లక్ష్యంగా జనసైనికులు బరిలో ఉంటారని పేర్కొన్నారు. స్థానికంగా జనసేన ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. విద్యావంతులైన యువతకు ప్రాధాన్యత ఇస్తూ బరిలో ఉంటామని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో జండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. అవినీతి రహిత పాలన జరగాలంటే యువతను గెలిపించాలని ఓటర్లను కోరారు. అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలు ప్రతి ఇంటికి చేరేలా జనసైనికులు పని చేయాలని పిలుపునిచ్చారు. త్వరలో నియోజకవర్గంలోని విద్యావంతులు, సామాజిక సేవకులు పార్టీలో చేరబోతునట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ రజాక్, కొంగరి రవితేజ, భాష బోయిన సమ్మయ్య, అక్కనపల్లి సాయి, మునిగాల పవన్, శెట్టి రాజేష్, వెంకట్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



# నితిన్ నబిన్ సారథ్యంలో బీజేపీకి నవశకం

- ఖమ్మంలో అంబరాన్నంటిన సంబరాలు..
- దేశహితమే ధ్యేయంగా పార్టీ బలోపేతం...
- బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు

**ఖమ్మం బ్యూరో, జనవరి 20(తెలంగాణ ముచ్చట్లు)**



భారతీయ జనతా పార్టీ నూతన జాతీయ అధ్యక్షులుగా నితిన్ నబిన్ బాధ్యతలు స్వీకరించడంతో ఖమ్మం జిల్లా బీజేపీ శ్రేణుల్లో నూతనోత్సాహం వెల్లివిరిసింది. ఈ శుభపరిణామాన్ని పురస్కరించుకుని మంగళవారం నాడు ఖమ్మం జిల్లా పార్టీ కార్యాలయంలో పండుగ వాతావరణం నెలకొంది. పార్టీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుని, టపాకాయలు కాల్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో పార్టీ పగ్గాలను నితిన్ నబిన్ చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కార్యాలయం మారుమోగేలా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ నితిన్ నబిన్ నియామకం పార్టీకి కొత్త శక్తిని అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమర్థవంతమైన నాయకత్వంలో, నితిన్ నబిన్ సారథ్యంలో బీజేపీ దేశవ్యాప్తంగా సరికొత్త శిఖరాలను అధిరోహిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేవలం రాజకీయ అధికారమే కాకుండా దేశహితమే ప్రధాన ధ్యేయంగా బీజేపీ పనిచేస్తోందని, నూతన అధ్యక్షుల నేతృత్వంలో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు తామంతా కృషి చేస్తామని తెలిపారు. ఖమ్మం జిల్లా పార్టీ పక్షాన నితిన్ నబిన్ కి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన పలువురు సీనియర్ నాయకులు, వివిధ మోర్చాల బాధ్యులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని సంబరాల్లో పాలుపంచుకున్నారు. ఖమ్మం జిల్లా ప్రబారి భర్త మహిపాల్ రెడ్డి , ఏదో డివిజన్ కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ వేరెల్లి రాజేష్ రవి రాథోడ్, నగరికంటి వీరభద్రం సుబ్బారావు , శ్రీకృష్ణ రవి గౌడ్ బోయల వెంకట్, మనీ తదితరులు పాల్గొన్నారు.

# అరైవ్ అలైవ్' అనేది కేవలం ఒక నినాదం కాదు

- పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**ఖమ్మం బ్యూరో, జనవరి 20(తెలంగాణ ముచ్చట్లు)**



'అరైవ్ అలైవ్' అనేది కేవలం ఒక నినాదంగా పరిమితం కాకుండా, రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతో ఒక ఉద్యమంలా ముందుకు సాగాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు.

రోడ్డు ప్రమాదాల కారణంగా జరుగుతున్న ప్రాణనష్టాన్ని తగ్గించి, ప్రతి ప్రయాణికుడు సురక్షితంగా గమ్యానికి చేరాలనే ఉద్దేశంతో తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 'అరైవ్ అలైవ్' అనే ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి వ్యక్తి సురక్షితంగా ఇంటికి చేరాలన్న ఆశ వారి కుటుంబ సభ్యుల్లో ఉంటుందని, రోడ్డు ప్రమాదాల్లో ప్రాణ నష్టం జరిగితే, ఆ కుటుంబాల బాధను ఎవరూ తీర్చలేరని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని అన్నారు. రోడ్డు ప్రమాదాలు యాదృచ్ఛికంగా జరగవని, మన నిర్లక్ష్యం, అతివేగం వల్లే ఎక్కువగా జరుగుతాయని తెలిపారు. ప్రధానంగా మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల అనేక కుటుంబాలు తమ ప్రధాన ఆదారాన్ని కోల్పోయి వీధిన పడుతున్నాయని, వాహనాల డ్రైవర్లు ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చే బాధ్యతను గుర్తుంచుకోవాలని తెలిపారు. మొబైల్ ఫోన్ వినియోగం, అతివేగం, రాంగ్ రూట్ డ్రైవింగ్ వంటి ప్రమాదకర చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ చేయవద్దని విజ్ఞప్తి చేశారు. మీ కోసం మీ కుటుంబ సభ్యులు ఇంటివద్ద ఎదురు చూస్తున్నారు అనే విషయాన్ని గుర్తుంచుకొని జాగ్రత్తగా ప్రయాణాలు చేయాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల గణాంకాలను పరిశీలిస్తే, ఎక్కువ శాతం ప్రమాదాలు మానవ నిర్లక్ష్యం వల్లే జరుగుతున్నాయని తెలిపారు. గ్రామాలు, పట్టణాలు, మండల కేంద్రాలు, జాతీయ రహదారులు, ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్లు, ఆసుపత్రులు, పరిశ్రమలు, మార్కెట్ ప్రాంతాలు, దేవాలయాలు, ప్రార్థనా మందిరాలు, ఫంక్షన్ హాళ్లు వంటి చోట్ల ప్రజలను నేరుగా కలుసుకుని అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు, యువతే మార్పుకు నాంది రోడ్డు భద్రతపై యువతలో చైతన్యం వస్తే సమాజం మొత్తం మారుతుందన్న నమ్మకంతో విద్యార్థులు, యువకులపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నామని తెలిపారు.



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU

ఎడిటర్: బొల్లెపాక రాజేష్ · తెలుగు దిన పత్రిక



# మహా జాతర మన మేడారం

పచ్చని అడవిలో కొలువైన సమ్మక్క సారక్క
కుంకుమ బరిణె లో గద్దెకు పయనం
కోయ పూజారులతో కొలువైన చిలకలగుట్ట
తల్లికి తడి బట్టలతో తానాలతో పూనకాలు!!

ధరణిలో సమ్మక్క సారక్కలు
కంక వనంలో సమ్మక్క సారక్క
మమ్ముకాపాడే సమ్మక్క సారక్క
కోయ ప్రాంతమందు సమ్మక్క సారక్క!!

వీరులు శూరులు సమ్మక్క సారక్క
త్యాగాల సిరులు సమ్మక్క సారక్క
కుంకుమ భరణిలో సమ్మక్క సారక్క పూజలు

సమ్మక్క సారక్క దీవెనలతో కొంగుబంగారం!!

తల్లికి నిలువెత్తు బంగారు బెల్లంతో భక్తుల మొక్కులు
అంబరమంటే సంబురం మన మేడారం
కోరిన కోరికలు తీర్చే సమ్మక్క సారక్కలు
భారతదేశం లో జరిగే అతి పెద్ద జాతరమేడారం!!

వన జాతర మన జాతర మేడారం
పచ్చని అడవిలో పవిత్ర జాతర మేడారం
బంగారం పెట్టి బాగుండాలని కోరే భక్తులు

నలుమూలల నుండి తరలివచ్చే భక్తులు
మహిమలున్న దేవతా మూర్తి సమ్మక్క
ములుగులో మూడు రోజుల పండుగ మన
మేడారం జాతర!!



**దేవులపల్లి రమేశ్**
**కలం: శ్రీ వర్ష**
**సిద్దిపేట, నంగునూర్**
**చరవాణి :- 9963701294**

# మైనారిటీ ఖమ్మం గర్ల్స్–1 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలో ఐఐటి –నీట్ ఉచిత కోచింగ్ ప్రవేశాలు

**ఖమ్మం బ్యూరో,జనవరి 20(తెలంగాణ ముచ్చట్లు)**




ఖమ్మం పట్టణంలో రాపర్తి నగర్ లో ఉన్న తెలంగాణ మైనారిటీ ఖమ్మం గర్ల్స్-1 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ లో 2026 27 విద్యా సంవత్సరానికి గాను ముస్లిం విద్యార్థినులకు ప్రాధాన్యతగా ఐఐటీ జేఈఈ మరియు నీట్ ఉచిత సమగ్ర కోచింగ్ ప్రవేశాలు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ అఖిల ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ కళాశాలలో డిజిటల్ తరగతులు, టాప్ పబ్లికేషన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ స్టడీ మెటీరియల్, అనుభవజ్ఞులైన అధ్యాపకులు ద్వారా శిక్షణ అందించబడుతుందని తెలిపారు. గత విద్యా సంవత్సరాల్లో ఈ కళాశాల నుండి ఎంబిబిఎస్, ఎన్ఐటి లు, ప్రముఖ ఇంజినీరింగ్ మరియు ఫార్మసీ కాలేజీల్లో ప్రవేశాలు, అలాగే రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించినట్లు వెల్లడించారు. విద్యార్థినులకు ఉచిత హాస్టల్ సౌకర్యం, నాణ్యమైన భోజనం, ఉత్తమ విద్యా వాతావరణం కల్పించబడుతుందని పేర్కొన్నారు.

ఖమ్మం మరియు కొత్తగూడెం జిల్లాలకు చెందిన ముస్లిం విద్యార్థినులకు ప్రాధాన్యతగా ఒకే ఒక్క సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ తెలంగాణ మైనారిటీ గురుకుల కళాశాల ఖమ్మం గర్ల్స్-1 మాత్రమే ఉండటంతో సీట్లు పరిమితంగా ఉన్నాయని తెలిపారు. తమ కళాశాలలో సీట్ల ఎంపీసీ: మైనారిటీ - 30, నాన్ మైనారిటీ - 10, బైపిసి: మైనారిటీ - 30, నాన్ మైనారిటీ - 10 గా ఉన్నాయని పేర్కొన్నారు.

ఈ ప్రవేశాల కోసం స్క్రీనింగ్ పరీక్ష ఫిబ్రవరి 12న నిర్వహించనున్నట్లు కూడా తెలిపారు.

ఆసక్తి గల విద్యార్థినులు టీజీఎంఆర్ఎస్ తెలంగాణ. సి జి జి. గోవ. ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఈరోజే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 91543 65017 నెంబర్ నందు మరియు రాపర్తి నగర్ కళాశాల నందు సంప్రదించి దరఖాస్తులు సమర్పించగలరని ప్రిన్సిపాల్ అఖిల ఒక ప్రకటనలో తెలియచేశారు

# పెండింగ్ ట్రాఫిక్ చలాన్‌లపై బలవంతం వద్దు

- **తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు**
- **వాహనదారులను ఇబ్బంది పెట్టొద్దని ట్రాఫిక్ పోలీసులకు సూచన**
- **చలాన్ వసూలు పేరుతో తాళాలు లాక్కోవడం, వాహనం ఆపడం నిషేధం**
- **చట్ట ప్రకారం నోటీసుల జారీకి ఆదేశం**

**హైదరాబాద్, జనవరి 20 (తెలంగాణ ముచ్చట్లు):**



వాహనాల పెండింగ్ ట్రాఫిక్ చలాన్‌ల అంశంలో తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. పెండింగ్ చలాన్‌ల పేరుతో వాహనదారులను బలవంతంగా ఇబ్బంది పెట్టవద్దని ట్రాఫిక్ పోలీసులను ఆదేశించింది. చలాన్‌లు వసూలు చేసే క్రమంలో బలవంతపు చర్యలు చట్టబద్ధం కాదని కోర్టు స్పష్టం చేసింది.

ట్రాఫిక్ పోలీసులు పెండింగ్ చలాన్‌ల వసూలు కోసం వాహనదారులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపిస్తూ హైకోర్టులో దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిగింది. ఈ పిటిషన్‌పై న్యాయవాది విజయ్ గోపాల్ వాదనలు వినిపించారు. వాహనాలను ఆపి, తాళాలు లాక్కోవడం, బలవంతంగా డబ్బులు వసూలు చేయడం జరుగుతోందని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు.

ఈ నేపథ్యంలో హైకోర్టు ట్రాఫిక్ పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. వాహనాలను ఆపిన సమయంలో చలాన్‌లు చెల్లించాలని బలవంతం చేయకూడదని, వాహన తాళాలు తీసుకోవడం, వాహనాన్ని నిలిపివేయడం వంటి చర్యలకు పాల్పడరాదని పేర్కొంది. వాహనదారు స్వచ్ఛందంగా చలాన్ చెల్లించేందుకు ముందుకు వస్తే మాత్రమే పోలీసులు వసూలు చేయవచ్చని తెలిపింది.

వాహనదారులు చలాన్‌లు చెల్లించడానికి ఇష్టపడని పక్షంలో, చట్ట ప్రకారం వారికి నోటీసులు జారీ చేయాలని హైకోర్టు ఆదేశించింది. ట్రాఫిక్ నిబంధనల అమలులో ప్రజల హక్కులు, గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని కోర్టు స్పష్టం చేసింది.

# సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులకు నాణ్యమైన గాగుల్స్ పంపిణీ

- **రోడ్లపై దీర్ఘకాలం విధులు నిర్వర్తించే సిబ్బందికి రక్షణ**
- **కాలుష్యం, ధూళి, ఎండ నుంచి కంటి భద్రతకు చర్య**
- **ఉన్నతాధికారుల సమక్షంలో కమిషనరేట్‌లో కార్యక్రమం**

**హైదరాబాద్, జనవరి 20 (తెలంగాణ ముచ్చట్లు):**





సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసు సిబ్బంది కంటి భద్రతకు చర్యలుగా నాణ్యమైన గాగుల్స్‌ను పంపిణీ చేసినట్లు సైబరాబాద్ జాయింట్ సీపీ (ట్రాఫిక్) డా. గజరావు భూపాల్ తెలిపారు. సైబరాబాద్ కమిషనరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ గాగుల్స్‌ను సిబ్బందికి అందజేశారు.

రోడ్లపై దీర్ఘకాలం విధులు నిర్వర్తించే ట్రాఫిక్ పోలీసులకు కాలుష్యం, ధూళి, తీవ్రమైన ఎండ వంటి సమస్యలు ఎదురవుతున్న నేపథ్యంలో ఈ గాగుల్స్ ఉపయోగకరంగా ఉంటాయని జాయింట్ సీపీ పేర్కొన్నారు. విధి నిర్వహణలో సిబ్బంది ఆరోగ్యం, భద్రహణ మరింత సమర్థవంతంగా సాగుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు.

సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసు వ్యవస్థలో మానవ వనరుల భద్రత, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీస్ అధికారులు స్పష్టం చేశారు.

# దుర్గం చెరువు దుర్గంధంపై హైడ్రా కఠిన చర్యలు

- **మురుగు నీరు నేరుగా చేరడంపై తీవ్ర ఆగ్రహం**
- **గుర్రపు డెక్క వ్యాప్తి కారణాలపై క్షేత్రస్థాయి పరిశీలన**
- **శాఖల సమన్వయంతో సమస్యకు శాశ్వత పరిష్కారం**

**హైదరాబాద్, జనవరి 20 (తెలంగాణ ముచ్చట్లు):**



మాధాపూర్ గుట్టల్లోని దుర్గం చెరువులో దుర్గంధం, గుర్రపు డెక్క విస్తృతి పెరుగుతున్న నేపథ్యంలో హైడ్రా ప్రత్యేక దృష్టి సారించింది. చెరువులోకి నేరుగా మురుగు నీరు చేరడాన్ని తీవ్రంగా పరిగణించిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. మీడియా కథనాలు, స్థానికుల ఫిర్యాదుల నేపథ్యంలో చెరువులో సగభాగం వరకు గుర్రపు డెక్క వ్యాపించడానికి గల కారణాలను ఆయన పరిశీలించారు. ఎస్‌టీపీలు ఉన్నప్పటికీ వరద కాలువ ద్వారా మురుగు నీరు నేరుగా చెరువులోకి కలవడంపై కమిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్‌టీపీల సామర్థ్యానికి మించిన మురుగు నీరు వస్తే మురుగు కాలువలకు మళ్లించాలి కానీ చెరువులోకి ఎలా కలుపుతారని అధికారులను ప్రశ్నించారు. ఒకవైపు శుద్ధి చేసిన నీటిని పంపుతూ, మరోవైపు మురుగు నీటిని నేరుగా వదిలేయడం సరికాదని స్పష్టం చేశారు.



చెరువు అభివృద్ధి అంటే పైపై అలంకరణ కాదని, మురుగు ప్రవాహాన్ని పూర్తిగా ఆపాల్సిందేనని చెరువు అభివృద్ధి పనులు చేపట్టిన సంస్థ ప్రతినిధులను ప్రశ్నించారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండబ్ల్యుఎస్ఎస్‌బి, ఇరిగేషన్ శాఖ, ఎస్‌టీపీ నిర్వహణ సంస్థల మధ్య సమన్వయం లేకపోవడమే దుర్గంధానికి కారణమని పేర్కొన్నారు. ఎస్‌టీపీ వద్ద శుద్ధి అనంతరం నీటి నమూనాలను సేకరించి పీసీబీకి పంపాలని అధికారులను ఆదేశించారు.

క్షేత్ర పరిశీలన అనంతరం హైడ్రా కార్యాలయంలో సంబంధిత అన్ని శాఖల అధికారులతో కమిషనర్ సమావేశమయ్యారు. వరద కాలువల్లోకి మురుగు నీరు వెళ్లకుండా పైపులైన్ డైవర్షన్ పనులు తక్షణమే చేపట్టాలని, ట్రాఫిక్ డైవర్షన్‌కు పోలీసు శాఖ సహకారం తీసుకోవాలని సూచించారు. చెరువుకు ఆనుకుని పశ్చిమ వైపు కాలువ తవ్వకం ద్వారా ఐటీ సంస్థల నుంచి వచ్చే మురుగు నీరు చెరువులోకి చేరకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శాఖల సమన్వయంతోనే దుర్గం చెరువుకు శాశ్వత పరిష్కారం సాధ్యమని హైడ్రా స్పష్టం చేసింది.

# సేంద్రియ సాగు వైపు రైతులు మళ్లాలి

- **సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ**
- **నేలకొండపల్లిలో రైతులకు అవగాహన సదస్సు**
- **రసాయనాల వల్ల నేల, ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం**
- **భూమి పవిత్రత కాపాడాల్సిన బాధ్యత అందరిదే**

**ఖమ్మం జిల్లా, జనవరి 20 (తెలంగాణ ముచ్చట్లు):**



నేలకొండపల్లిలోని సిద్ధార్థ యోగ విద్యాలయంలో సేంద్రియ వ్యవసాయంపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రసాయన ఎరువులు, పురుగుల మందుల అధిక వినియోగం వల్ల నేల క్రమంగా విషతుల్యంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీని ప్రభావం నేరుగా ప్రజల ఆరోగ్యంపై పడుతోందని పేర్కొన్నారు.

గతంలో ఉన్నట్లుగానే ప్రతి రైతు మళ్లీ సేంద్రియ సాగు వైపు మళ్లాలని నారాయణ పిలుపునిచ్చారు. దేశంలో అత్యంత సారవంతమైన భూములు ఉన్నప్పటికీ, సరైన ఉపాధి అవకాశాలు లేక యువత విదేశాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని విమర్శించారు. విత్తనాలు, ఎరువుల వ్యాపారం పూర్తిగా కార్పొరేట్ కంపెనీల చేతుల్లోకి వెళ్లడంతో లాభాలు రైతులకు కాకుండా బడా సంస్థలకే చేరుతున్నాయని ఆరోపించారు. చివరి ఊపిరి వరకు కమ్యూనిస్టు పార్టీలోనే పనిచేస్తానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

ఈ సదస్సులో త్రిదండి శ్రీమన్నారాయణ చిన్న జీయర్ స్వామి కూడా పాల్గొని ప్రసంగించారు. భూమి పవిత్రతను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, మనిషి అత్యాశ వల్ల ప్రకృతి సమూల నాశనానికి గురవుతోందని హెచ్చరించారు. హైబ్రిడ్ సాగు విధానాలు, పశుపోషణలో జరుగుతున్న మార్పుల వల్ల రోగాలు పెరుగుతున్నాయని, నేటి ఆహారం ఎక్కువగా కలుషితమైందని తెలిపారు.

ప్రకృతి బాగుంటేనే మనిషి జీవించగలడని, భూమికీ ప్రాణం ఉందని చిన్న జీయర్ స్వామి అన్నారు. భూమికీ విరామం ఇవ్వాల్సిన బాధ్యత సమాజంపై ఉందని, సేంద్రియ సాగు ద్వారానే ఆరోగ్యకరమైన భవిష్యత్తు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. రైతులు, ప్రజలు ప్రకృతితో సమతుల్యంగా జీవించాల్సిన అవసరం ఉందని ఈ సదస్సులో వక్తలు ఏకగ్రీవంగా అభిప్రాయపడ్డారు.

# సిగ్నల్ జంప్ ఒక ప్రాణం ఖరీదు కావొచ్చు మంత్రి పొన్నం ప్రభాకర్

- **ట్రాఫిక్ నిబంధనల పాటనపై ప్రజలకు విజ్ఞప్తి**
- **అడ్డదిడ్డ డ్రైవింగ్‌తో ప్రమాదాల ముప్పు**
- **ఒక్క నిమిషం ఆగితే క్షేమం ఖాయం**

**హైదరాబాద్, జనవరి 20 (తెలంగాణ ముచ్చట్లు):**



ట్రాఫిక్ సిగ్నల్ వద్ద నిర్లక్ష్యంగా వ్యవహరించడం ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. సిగ్నల్ జంపింగ్ వల్ల తనతో పాటు ఎదుటివారికీ తీవ్ర ఇబ్బందులు, ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర ఒక్క నిమిషం ఆగడం ద్వారా అనేక ప్రాణాలు కాపాడవచ్చని మంత్రి సూచించారు. అడ్డదిడ్డంగా డ్రైవింగ్ చేయడం, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా రద్దీ ప్రాంతాలు, జంక్షన్ల వద్ద ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ప్రజలను కోరారు.

సిగ్నల్ జంపింగ్‌కు పాల్పడితే ప్రమాదాలతో పాటు చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రతి వాహనదారుడు బాధ్యతగా వ్యవహరించి ట్రాఫిక్ నియమాలను పాటిస్తేనే రహదారులపై భద్రత సాధ్యమని మంత్రి అన్నారు.

ప్రజల భద్రతే ప్రభుత్వ లక్ష్యమని, అందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ క్షేమంగా గమ్యానికి చేరాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in